తాగొచ్చిన పెళ్లికొడుకు చెంప ఛెడేల్



2

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సీఎం విజయ్ మారథాన్



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 27 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 172 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- సీఎస్ రామక్రిష్ణారావు కీలక బాధ్యతలు
- సీఎం సలహాదారుగా నియామకం
- ఈనెల 30న సీఎస్ పదవీ విరమణ

**హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా కొనసాగుతున్న




రామకృష్ణారావు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో సంజయ్ జాజును ప్రభుత్వం నియమించింది. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న సంజయ్ జాజును తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రధాన కార్యదర్శి పోస్టుకు సంజయ్ జాజుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ పేరును కూడా సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. చివరికి సంజయ్ జాజు వైపే ఆయన మొగ్గు చూపారు.

1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు, కేంద్ర సర్వీసు నుంచి ఇటీవలే తెలంగాణ క్యాడర్‌కు తిరిగి వచ్చారు. ప్రారంభంలో ...మిగతా 2లో

## 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

### సీఎం ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్

**హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా బదిలీలలో సీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్. శ్రీధర్ నియమితులయ్యారు. ఈక్రమంలో చేనేత హస్తకళల ...మిగతా 2లో



డ్రగ్స్ 'మహమ్మారి'ని

## రూపుమాపుదాం

### ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### సీఎం రేవంత్ కీలక సందేశం

**హైదరాబాద్, జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి):** డ్రగ్స్ సమాజాన్ని నాశనం చేస్తాయని, మత్తుపై చేసే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశమిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు ...మిగతా 2లో

## 'మత్తు'ను మట్టుబెడదాం

### యువతకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు

- శిల్పకళా వేదికలో యాంటీ డ్రగ్స్ దినోత్సవం
- డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- ఈగల్ పోలీసులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్
- రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన
- సినీ పరిశ్రమకూ భట్టి విజ్ఞప్తి




## రహదారులకు మహర్దశ

- రూ.13,006 కోట్లతో మెగా రోడ్డు ప్రాజెక్టు
- 6,092 కి.మీ విస్తరించిన 441 రోడ్ల అభివృద్ధి
- సీఎం రేవంత్ కీలక నిర్ణయం
- ఈ నెల 28న నల్గొండలో ప్రారంభం



**హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు జూన్ 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్యపరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు ...మిగతా 2లో

## ఎన్సీఈఆర్టీ తొమ్మిదో తరగతి పాఠ్యాంశంగా 'సర్'

**ఢిల్లీ , జూన్ 26 :** ఎన్సీఈఆర్టీ కొత్తగా రూపొందించిన 9వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేర్చారు. అర్హులైన పౌరులను ఓటర్ల




జాబితా నుంచి విస్మరించకుండా.. అనర్హులెవరూ ఈ జాబితాలో చేరకుండా చూసే ప్రక్రియగా దీనిని పుస్తకంలో వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లందరినీ, ముఖ్యంగా అవగాహన లేకపోవడం వల్ల ఓటరుగా నమోదు చేసుకోని లక్షలాది మంది 18ఏళ్లు నిండిన యువ ఓటర్లను జాబితాలో చేర్చినట్లు 'అండర్బాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్' అనే పాఠ్యపుస్తకంలోని ఓ విభాగంలో పేర్కొన్నారు.

ఓటరు మరణం, నివాస మార్పు, నకిలీ నమోదు, శాశ్వతంగా ఆచూకీ తెలియకపోవడం వంటి వాటి ఆధారంగా కూడా ఖిఐఖ పేర్లను తొలగిస్తుందని ఎన్సీఈఆర్టీ తన పాఠ్యాంశాలో పేర్కొంది. నకిలీ వార్తలు, ...మిగతా 2లో

సీఆర్ పాటిల్ ఏం మాట్లాడారో

## సీఎం స్పష్టత ఇవ్వాలి

- బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

**హైదరాబాద్, జూన్ 26:** కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఏ ప్రాజెక్టుల గురించి మాట్లాడారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడి స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''సీఎం రేవంత్‌రెడ్డి తుంగభద్రపై చాలా మాట్లాడుతున్నారు. తుంగభద్ర గేట్ల వరకు మేము స్వాగతిస్తున్నాం. సీఆర్ పాటిల్ ఏయే ప్రాజెక్టుల గురించి మాట్లాడారో చెప్పాలి. తెలంగాణకు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీలు రావాల్సిఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలను మోసం చేశాయి. మనకు రావాల్సిన వాటా కంటే తక్కువకి కేసీఆర్ సంతకం పెట్టారు. ఎస్ఐఆర్‌పై ఎంఐఎం అధ్యక్షుడు ఎంపీ సలావుద్దీన్ ఓవైసీ కామెంట్స్‌ను



ఖండిస్తున్నా. బీజేపీ ఐడీ కార్డ్ ఉంటేనే చెల్లుతుందా? పాస్ పోర్ట్ చెల్లదా అని ఓవైసీ అడుగుతున్నారు. 2013లో బాంబే హైకోర్టు పాస్ పోర్ట్ ట్రావెల్ డాక్యుమెంట్ అని, సిటిజన్ షిప్‌నకు ప్రూఫ్ కాదని చెప్పింది. దలైలామాకి కూడా ఎల్లో పాస్‌పోర్టు ఉంది.. కానీ, ఇండియన్ సిటిజన్షిప్ కాదు. ఎస్ఐఆర్‌లో చూపించడానికి 12 రకాల ధ్రువపత్రాలు ఉన్నాయి. ప్రజలను కాంగ్రెస్, ఎంఐఎం తప్పుదోవ పట్టిస్తున్నాయి. బీజేపీ వచ్చాక ఎస్ఐఆర్ తీసుకురాలేదు.. కాంగ్రెస్ హయాంలో ఎస్ఐఆర్ జరిగింది.'' అని రామచంద్రరావు అన్నారు.

## తులం..ఇనుమూ ఇవ్వరు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా పరిగిలో శుక్రవారం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా పథకాలేవీ తేలేదన్నారు. రూ.12వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన రేవంత్.. కనీసం లక్షాధికారులను చేయాలన్నారు.



బంజీ జంపింగ్‌పై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా ఇంటర్వ్యూలో బంజీ జంపింగ్ అంటే తనకు చాలా భయం అని కేటీఆర్ చెప్పారు. ఒక తాడు కట్టుకుని కిందకు దూకడం అంటే అది తెగుతుంది ఏమో అని భయం వేస్తుందన్నారు. కానీ ప్యారచ్యూట్ వేసుకుని స్కై డైవింగ్ చేయడం దానికంటే సులభం అని వ్యాఖ్యానించారు. జగనన్న బంజీ జంపింగ్ ఎలా చేశాడో తెలియదు కానీ ఈసారి కలిసినప్పుడు అడుగుతానని చెప్పారు. అలాగే కేసీఆర్ చాలా కాలంగా మౌనంగా ఉన్నారు? ఎందుకు మాట్లాడడం లేదని యాంకర్ ప్రశ్నించగా గోడకు వేలాడదీసిన తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని అన్నారు.అది పేలేవరకు సైలెంట్ గానే ఉంటుందని, పేలితే ఓ విస్ఫోటనం అని వ్యాఖ్యానించారు. తాము అంతా కేసీఆర్ తయారు చేసిన ...మిగతా 2లో

## తొలిసారి భారత్ పర్యటనకు జపాన్ ప్రధాని తకాయిచి



**ఢిల్లీ, జూన్ 26:** జపాన్ ప్రధాని సనాయె తకాయిచి భారత్ పర్యటనకు రానున్నారు. మూడు రోజుల పాటు ఆమె ఇక్కడ పర్యటించనున్నారు. ఢిల్లీలో జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సు జరగనుంది. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు ఈ సదస్సులో పాల్గొనేందుకు తకాయిచి రానున్నట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరు దేశాధినేతలు అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని పేర్కొంది. సనాయె తకాయిచి భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. గతేడాది టోక్యోలో ఇరుదేశాల మధ్య జరిగిన 15వ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. అప్పుడే ఆమెను భారత్‌కు ఆహ్వానించారు. టోక్యో సదస్సు తర్వాత ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలోపేతమయ్యాయని విదేశాంగశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

### హీరా గోల్డ్ ఆస్తుల.. వేలం

'సుప్రీం' ఆదేశాలతో రంగంలోకి ఈడీ 2

రూ.159 కోట్ల విలువైన 23 ఆస్తుల వేలం

### కనిష్కను కూల్చింది ఖలిస్థానీ ఉగ్రవాదులే

అధికారికంగా అంగీకరించిన కెనడా 9

### 'సిందూర్'లో అమరులను ప్రకటించిన కేంద్రం

9

వెనెజువెలా జంట భూకంపాలు..

## 40వేల మంది మిస్సింగ్

- ఒక్క నగరంలోనే 100 భవనాలు నేలమట్టం
- అందుబాటులోకి 'ఎక్స్'
- అమెరికా నుంచి యుద్ధ నౌకలు

**కారకస్, జూన్ 26 :** లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంతకూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడినట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల



సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆ ఒక్క నగరంలోనే 100 భవనాలు కూలి..**

వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ...మిగతా 2లో

### 589కి చేరిన మరణాలు

వెనెజువెలాలో భూకంపం పెను విషాదం నింపింది. ఈ భూ విలయం సృష్టించిన విధ్వంసంలో మృతుల సంఖ్య 589కి పెరిగింది. గాయపడిన వారి సంఖ్య 3 వేలు దాటింది. ఈ మేరకు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వివరాలను వెల్లడించారు. అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న లాగువేరా ప్రావిన్సులో సహాయక చర్యల కోసం సైనికులను మోహరిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు శిథిలాల కింద వందలాది మంది చిక్కుకుపోయినట్లు అక్కడి ప్రభుత్వం అంచనా వేస్తోంది. గల్లంతైన వారి వివరాలను సేకరించేందుకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో ఇప్పటివరకు దాదాపు 50 వేల మంది పేర్లు నమోదైనట్లు సమాచారం

వెనెజువెలా కోసం

## ఆపరేషన్ అమిస్టాడ్!

### విదేశాంగ మంత్రి జైశంకర్

**ఢిల్లీ, జూన్ 26:** భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్'కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సీ17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు.

భారత సైన్యానికి చెందిన ఫీల్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు ...మిగతా 2లో

ఒక్క రాత్రే రష్యాపైకి

## 660 డ్రోన్‌లతో దాడి



**మాస్కో, జూన్ 26 :** ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా మాస్కో ఆధీనంలో ఉన్న క్రిమియాతో పాటు రష్యా వ్యాప్తంగా 12 ప్రాంతాలపై కీవ్ వందల కొద్దీ డ్రోన్లతో విరుచుకుపడింది. ఒక్క రాత్రే 660 డ్రోన్లను ప్రయోగించింది. వీటన్నింటిని తాము సమర్థవంతంగా అడ్డుకున్నామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది.

రాజధాని మాస్కో సహా అజోవ్, నల్ల సముద్ర తీరంలోని నగరాలు, క్రిమియాను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది. తమ నగరంవైపు దూసుకొచ్చిన 47 డ్రోన్లను ...మిగతా 2లో

# తాగొచ్చిన పెళ్లికొడుకు చెంప ఛెడేల్

**రాయ్‌పూర్, జూన్ 26 :** మూడుముళ్లు పడే ముందు కాబోయే జీవిత భాగస్వామి గురించి కొన్ని చేదునిజాలు తెలిసినా కుటుంబ పరువు గురించి ఆలోచించి 'తలరాత' అని సరిపెట్టుకునే యువతులను చాలా కుటుంబాల్లో





చూస్తుంటాం. ఛత్తీస్‌గఢ్‌లోని జాంజగీర్ చాంపా జిల్లాకు చెందిన ముస్కాన్ ప్రధాన్ (22) అనే యువతి మాత్రం ఎదురుతిరిగి తన జీవితాన్ని నిలబెట్టుకొంది. ఈ నెల 23వ తేదీ రాత్రి కోస్మొండా గ్రామంలోని ముస్కాన్ ఇంటికి వరుడి ఊరేగింపు వచ్చింది. కారు దిగిన వరుడు మద్యం మత్తులో కనీసం నిలబడలేకపోతున్నాడు. ఈ విషయం ఇంట్లో ఉన్న వధువు ముస్కాన్ చెవినపడింది. తాగుడు కారణంగా చిన్నవయసులోనే తండ్రిని పోగొట్టుకొన్న ముస్కాన్ పరుగున గడప దాటొచ్చి వరుడి చెంప ఛెల్లుమనిపించింది. అతడితో పెళ్లి ససేమిరా వద్దంటూ తేల్చి చెప్పింది. ఆమె నిర్ణయానికి కుటుంబసభ్యులు కూడా మద్దతు పలకడంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగి కొంతమంది ఆసుపత్రి పాలయ్యారు. పోలీసులు జోక్యం చేసుకొని పెళ్లి ఊరేగింపును వెనక్కు పంపారు. జిల్లా ఎస్పీ విజయ్‌కుమార్ పాండే.. ముస్కాన్‌ను సత్కరించి, రూ.5,000 గౌరవ వేతనంతో కౌన్సెలరుగా నియమించారు. జిల్లా కలెక్టర్ జనమేజయ్ మహోబే సైతం అభినందించి.. పదో తరగతితో ఆగిపోయిన ముస్కాన్ చదువు కొనసాగేందుకు సహకరిస్తామని, కుటుంబానికి ప్రభుత్వ పథకాలు మంజూరుచేస్తామని హామీ ఇచ్చారు.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సీఎం విజయ్ మారథాన్

**చెన్నై, జూన్ 26 :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మారథాన్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని తమిళనాడు సర్కారు శుక్రవారం చెన్నైలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విజయ్ 6 కిలోమీటర్ల మేర పరుగెత్తారు. ఈ



కార్యక్రమంలో మంత్రులు, వాలంటీర్లు సహా వేలాదిమంది ఔత్సాహికులు పాల్గొన్నారు. మారథాన్ ప్రారంభానికి ముందు విజయ్ అక్కడి వారితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని.. ప్రతిరోజు తప్పకుండా రన్నింగ్ చేయాలని యువతకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై కుటుంబసభ్యులకు, స్నేహితులకు తెలియజేయాలని కోరారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతివ్వాలని కోరారు. ప్రజలను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రోత్సహించడానికి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మారథాన్లు, మినీ మారథాన్‌లు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

# ఎన్సీఈఆర్టీ తొమ్మిదో తరగతి పాఠ్యాంశంగా 'సర్'

**(మొదటి పేజీ తరువాయి)**

తప్పుడు సమాచారం, బెదిరింపులు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించినందుకు భారత ఎన్నికల సంఘాన్ని ప్రశంసించింది. 'స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు సవాళ్లు' అనే శీర్షికతో దేశంలోని విభిన్న ప్రాంతాల్లో విస్తరించి ఉన్న వేలాది పోలింగ్ కేంద్రాలు, వందలాది రాజకీయ పార్టీలతో 96.8కోట్ల మంది ఓటర్లకు ఎన్నికలు నిర్వహించడం ఓ సవాలుతో కూడుకున్న పని అని పేర్కొంది.

**సర్కు నేటితో ఏడాది..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అమల్లోకి తీసుకువచ్చి.. నేటితో ఏడాది పూర్తయింది. మొదటిసారిగా బిహార్ ఎన్నికలకు ముందు పైలట్ ప్రాజెక్టు సర్కు ఆ రాష్ట్రంలో ప్రారంభించారు. బిహార్లో దాదాపు 65 లక్షల నకిలీ పేర్లను తొలగించి.. ఈసీ ఓటర్ల జాబితాను రూపొందించింది. అనంతరం యూపీ, బెంగాల్, గుజరాత్, తమిళనాడు, కేరళ సహా 9రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. తన విధుల్లో భాగంగా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల నుంచి దాదాపు 6కోట్ల నకిలీ ఓటర్లను తొలగించింది. మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

# 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రత్యేక కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్కు అదనపు బాధ్యతలు అప్పగించారు. విపత్తు నిర్వహణ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియామకం కాగా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్గా కె.చంద్రకళ, చేనేత, హస్తకళల జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బి.అజిత్ రెడ్డి, టీజీ రెడ్కో వీసీఎండీగా ముషారఫ్ అలీ ఫారుఖీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి.వెంకన్న, పర్యాటక శాఖ డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. పాలనా యంత్రాంగాన్ని మరింత వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం సీఎంవోలో భారీ ప్రక్షాళన చేపట్టింది. ఇందులో భాగంగా కొంతకాలంగా సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న అజిత్ రెడ్డిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. అదే సమయంలో, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌కు ముఖ్యమంత్రి కార్యాలయంలో చోటు కల్పించారు. సమర్థుడైన అధికారిగా పేరున్న శ్రీధర్ రాకతో సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలు మరింత వేగవంతం కానున్నట్లు సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. సీఎంవోను మరింత పటిష్టం చేసే వ్యూహంలో భాగంగానే ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది.

# 'మత్తు'ను మట్టుబెడదాం

**హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో మత్తును మట్టుబెట్టి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ శిల్పకళా వేదికలో అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్సుకు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

డ్రగ్స్ రవాణా, వినియోగంలో ఎంతటి పెద్దవారున్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. నటీనటులు ఏది చెప్తే దానిని నమ్మే అభిమానుల కోసం.. నటీనటులంతా సే నో టూ డ్రగ్స్ వీడియో సందేశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరపున కఠినమైన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి పౌరుడు సైనికుడిగా మారాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ అనేది యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక శాపమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడుతోందన్నారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు.డ్రగ్స్‌కు బానిసైన వారిని సమాజం దూరం పెట్టకుండా వారికి సరైన మార్గం చూపాలని, మిత్రుల్లో ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటు పడితే వారిని ఆ ప్రమాదం నుంచి బయటపడేలా సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ నియంత్రణ అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజమంతా కలిసి పోరాడాల్సిన యుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రతి ఒక్కరూ సైనికులుగా మారాలని,



యువత సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతి యువకుడు జీవితాన్ని విలువైనదిగా భావించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ముఖ్యంగా తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా ఎదగాలని సూచించారు.

డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. డ్రగ్స్ నియంత్రణ అత్యంత సవాళ్లతో కూడుకున్న బాధ్యత అని అన్నారు. ఈ పోరాటంలో ఈగల్ బృందానికి అవసరమైన ప్రత్యేక వాహనాలు, డ్రగ్ డిటెక్షన్ పరికరాలు, ఆధునిక సాంకేతిక వనరులను తెలంగాణ ప్రభుత్వం అందించిందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ తమకు అండగా నిలుస్తోందని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 2024లో నిర్వహించిన చర్యల్లో 822 మంది విద్యార్థులు డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల్లో గుర్తించబడ్డారని, అలాగే సుమారు 600 మంది డ్రగ్స్ వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్‌కు పంపించామని తెలిపారు.డ్రగ్స్ నిర్మూలనలో చట్టపరమైన చర్యలతో పాటు అవగాహన, కౌన్సెలింగ్, పునరావాసం కూడా కీలకమని పేర్కొన్న సందీప్ శాండిల్య, ప్రభుత్వ సహకారంతో ఈగల్ విభాగం డ్రగ్స్ నియంత్రణకు మరింత సమర్థవంతంగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేక అవగాహనలో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, ఇతర పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సి.వి. ఆనంద్ తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

డ్రగ్స్‌కు అలవాటు పడిన స్నేహితులైనా, మరెవరైనా సరే డ్రగ్స్ తీసుకోమని ఒత్తిడి తెస్తే ఏమాత్రం సంకోచించకుండా ముఖం మీదే 'నో' అని గట్టిగా చెప్పాలని హీరో రామ్ పోతినేని అన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే.. ఆ వ్యసనం నుంచి బయట పడటం కష్టమన్నారు. డగ్స్ అనేది ఒక ఊబి లాంటిదని, జీవితంలో ఒక్కసారి దానికి అలవాటు పడితే మళ్లీ ఆ నరకం నుంచి బయటపడటం దాదాపు అసాధ్యమని చెప్పారు. క్షణికానందం కోసం డ్రగ్స్ వైపు అడుగులు వేసి, అమూల్యమైన జీవితాన్ని చేతులారా నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

# లండన్‌లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి



**రాజంపేట, జూన్ 26:** లండన్‌లో తెలంగాణకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం శ్రీనాథ్ గతేడాదే లండన్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మధుసూదన్ రెడ్డి, మంజుల దంపతుల కుమారుడు శ్రీనాథ్ రెడ్డి లండన్‌లోని లీసెస్టర్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్.. రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉన్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మరణ వార్తతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. శ్రీనాథ్ మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తులం..ఇనుమూ ఇవ్వరు

**(మొదటి పేజీ తరువాయి)**

కార్యకర్తలమని, తాము మాట్లాడే ప్రతిమాట కేసీఆర్ మాటేనని అన్నారు. కేసీఆర్ ఇచ్చే డైరెక్షన్ ప్రకారమే మాట్లాడతామని, ఆయన డైరెక్షన్ ప్రకారమే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతిసందర్భంలో నాయకుడు ముందు ఉండాల్సిన అవసరంలేదని, నాయకుడు అనేవాడు నడిపిస్తాడని అన్నారు. వెనుక నుండి ఆయన ఓ శక్తిలా ఆశీర్వదిస్తే చాలు అని వ్యాఖ్యానించారు.

**రేవంత్.. రెన్యువల్ సీఎం.. : కేటీఆర్**

రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు. ఆయన రెన్యువల్ సీఎం. ఇప్పటి వరకు 72 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు. తన పదవిని కాపాడుకోవడం.. మూటలు అక్కడికి తీసుకెళ్లడంపై పెట్టిన శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై చూపడం లేదు' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ప్రతి మహిళకూ మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని ఐదేళ్లకు కలిపి ఒక్కో మహిళకు రూ.లక్షన్నర ఇవ్వాలని ఆ డబ్బులు వారి అకౌంట్లలో జమ చేస్తే తాను రాజకీయాల నుంచి వైదొలగుతానని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు రూ.72 వేల కోట్ల అప్పు ఉంటే తమ ప్రభుత్వం పదేళ్లలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారు రెండున్నరేళ్లలోనే రూ.4 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. చేవెళ్ల ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత తమకే దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి వల్లే స్థిరాస్తి రంగం కుప్పకూలిందని ఆరోపించారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌కు అస్వస్థత

**హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు అస్వస్థతకు గురయ్యారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన ఖైరతాబాద్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రిలో చేరారు. దాదాపు 78ఏళ్ల వయసు ఉన్న హనుమంతరావు గతంలోనూ పలుమార్లు అస్వస్థతకు గురయ్యారు. గతంలోనూ ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం కోలుకున్నారు. కాంగ్రెస్‌లో దశాబ్దాల కాలం నుండి పనిచేస్తున్న ఆయన ఎప్పుడూ చురుగ్గా ఉంటూ కాంగ్రెస్ యువనేతలలో జోష్ పెంచుతూ ఉంటారు. ఇప్పుడు ఆయన అస్వస్థతకు గురవ్వడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

# రహదారులకు మహర్దశ

**(మొదటి పేజీ తరువాయి)**

చేయనున్నారు. హ్యామ్ విధానంలో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈనెల 28న కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది

## వెనెజువెలా జంట భూకంపాలు..

# 40వేల మంది మిస్సింగ్

**(మొదటి పేజీ తరువాయి)**

ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది. ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు.

**అందుబాటులోకి 'ఎక్స్'..**

భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్ను నిషేధించిన సంగతి తెలిసిందే.

**అమెరికా నుంచి యుద్ధ నౌకలు..**

మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి.

## వెనెజువెలా కోసం

# ఆపరేషన్ అమిస్టాడ్!



**(మొదటి పేజీ తరువాయి)**

పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనెజువెలా ప్రభుత్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమిస్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం.

వరుస భూకంపాల దాటికి వెనెజువెలాలో భారీ భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని సాధ్యమైనంత త్వరగా బయటకు తీసేందుకు భారీ నిర్మాణ పరికరాలు అవసరమని, వీటిని అందుబాటులో ఉంచాలని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ అక్కడి వ్యాపార సంస్థలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, అమెరికా, చిలీ, స్విట్జర్లాండ్, తుర్కియే నుంచి సహాయక బృందాలు ఇప్పటికే వెనెజువెలా చేరుకొని రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఖతార్, బ్రెజిల్, స్పెయిన్, పోర్చుగల్, కెనడా దేశాధినేతలు కూడా తమ బృందాలను పంపిస్తామని ప్రకటించారు.

## ఒక్క రాత్రే రష్యాపైకి

# 660 డ్రోన్‌లతో దాడి

**(మొదటి పేజీ తరువాయి)**

కూల్చేసినట్లు మాస్కో మేయర్ వెల్లడించారు. అయితే, దీని వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందా? అనే వివరాలను ఆయన బయటపెట్టలేదు. నోవోమోస్కోవ్స్క్ ప్రాంతంలోని ఓ కెమికల్ ప్లాంట్, హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించగా.. అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై రష్యా నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఈ దాడుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లినట్లు తెలుస్తోంది.

ఈ యుద్ధాన్ని ముగించేందుకు ఏడాది కాలంగా అమెరికా చేపట్టిన శాంతి ప్రయత్నాలు ఎలాంటి పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలోనే రష్యా సైనిక స్థావరాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఉక్రెయిన్ ఇటీవల కాలంలో తమ దాడులను ఉద్ధృతం చేసింది. దీనిపై తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందించారు. ''యుద్ధం ముగించేలా రష్యాపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంగా 40 రోజుల పాటు కీలక ఆపరేషన్ చేపట్టనున్నాం'' అని వెల్లడించారు. ఈ సమయంలో తమ చర్యలు అత్యంత ఉద్ధృతంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలుడిన కొద్ది గంటలకే రష్యాపై కీవ్ డ్రోన్లతో విరుచుకుపడటం గమనార్హం.

మరోవైపు, రష్యా కూడా క్షిపణులతో దాడులు ముమ్మరం చేసింది. గత 24 గంటల్లో ఖర్కీవ్‌లో మాస్కో జరిపిన దాడిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. గత రాత్రి 189 రష్యన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా.. కీవ్‌పై సైనిక చర్యకు గానూ రష్యాపై విధించిన ఆర్థిక ఆంక్షలను మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు ఐరోపా సమాఖ్య వెల్లడించింది. 2027 జులై 31 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని ఓ ప్రకటన విడుదల చేసింది.

# డ్రగ్స్ 'మహమ్మారి'ని రూపుమాపుదాం

**(మొదటి పేజీ తరువాయి)**

రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని, మత్తు మహమ్మారిని రూపుమాపడానికి ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు.

# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

**(మొదటి పేజీ తరువాయి)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సబ్ కలెక్టర్, పశ్చిమగోదావరి కలెక్టర్, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, కమిషనర్‌గాపని చేశారు. ఈ నేపథ్యంలో ఆయన 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. కాగా కొత్త సీఎస్ సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నారు.జాజుకు అదనపు బాధ్యతలు : కొత్తగా సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్‌జాజుకు అదనంగా పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక సీఎస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. అలాగే సీఎంవోలోని స్పీడ్ విభాగం సీఈవోగా, పరిశ్రమలు-పెట్టుబడుల విభాగం ప్రత్యేక కార్యదర్శి బాధ్యతలు అప్పగించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. పదవీ విరమణ రోజే రామకృష్ణారావుకు కొత్త బాధ్యతలు

తెలంగాణ సీఎస్‌గా పదవీ విరమణ చేయనున్న కె.రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుడిగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ . ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎం. రఘునందన్ రావు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్న కె. రామకృష్ణారావు ఈ నెల 30న రిటైర్ అయిన వెంటనే ముఖ్యమంత్రికి సలహాదారుతో పాటు ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొత్త బాధ్యతలు స్వీకరిస్తారని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఆయన నియామక కాలపరిమితి, జీతభత్యాలు, ఇతర సేవా నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్న రామకృష్ణారావుకు పదవీ విరమణ రోజే అత్యున్నత పదవీ దక్కడం సచివాలయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నియామకపు ఉత్తర్వుల ప్రతులను రాష్ట్రంలోని అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులకు, అకౌంటెంట్ జనరల్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమాచారం నిమిత్తం పంపారు.

# హీరా గోల్డ్ ఆస్తుల..వేలం

## 'సుప్రీం' ఆదేశాలతో రంగంలోకి ఈడీ

## రూ.159 కోట్ల విలువైన 23 ఆస్తుల వేలం



హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి): అధిక వడ్డీల ఆశ చూపి వేలకోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో హీరా గోల్డ్ ఆస్తులను ఈడీ హైదరాబాద్‌లో వేలం వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రూ.159 కోట్ల విలువైన 23 ఆస్తులను శుక్రవారం ఈడీ అధికారులు వేలం వేశారు. హీరాగోల్డ్‌లో పెట్టుబడులు పెడితే సంవత్సరానికి 36 శాతానికి పైగా రాబడి ఇస్తామని పెట్టుబడిదారులను నమ్మించి దేశవ్యాప్తంగా రూ.5,978 కోట్లకు పైగా నిధులు సేకరించింది. నమ్మి పెట్టుబడి పెట్టినవారికి ఒక్కరూపాయి కూడా తిరిగి చెల్లించలేదని ఈడీ గుర్తించి విచారణ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఆపై కోర్టు.. ఆస్తుల్ని వేలం వేయాలని ఆదేశించగా ఎమ్ఎస్‌టీఎస్ ద్వారా ఈ-వేలం నిర్వహించింది. వేలం ద్వారా వచ్చిన డబ్బును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్న ప్రత్యేక ఖాతాకు మళ్లించి.. ఆ తర్వాత బాధితులకు పంపిణీ చేసేలా ఈడీ ఏర్పాట్లు చేసింది.

**భారీ.. స్కాం :**

దేశ చరిత్రలోనే అతిపెద్ద పొంజీ స్కాముల్లో ఒకటిగా నిలిచిన హీరా గ్రూప్ అధినేత్రి నౌహీరా షేక్ ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారు. ఇస్లామిక్ బ్యాంకింగ్, హలాల్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో బంగారం వ్యాపారంలో పెట్టుబడులు పెడితే ఊహించని విధంగా ఏడాదికి 36 నుంచి 42 శాతం వరకూ లాభాలు ఇస్తామని నమ్మబలికారు. ఆఫర్ కు ఆశపడి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ వంటి రాష్ట్రాల నుంచి 1.7 లక్షల మంది బాధితులు పెట్టుబడులు పెట్టారు. అలా దేశమంతా రూ.5,978 కోట్లకు పైగా నిధులను వసూలు చేసిన సంస్థ.. మొదటిలో కొందరికి లాభాలిచ్చి నమ్మించింది. 2018 నాటికి పెట్టుబడిదారులకు అసలు డబ్బు తిరిగివ్వకుండా బోర్డు తిప్పేసింది. ఈ భారీ మోసం పై కేసు నమోదు కాగా.. దర్యాప్తు చేసిన ఈడీ.. హీరా గ్రూప్ ఎలాంటి బంగారం వ్యాపారం చేయలేదని తేల్చింది. కొత్త పెట్టుబడిదారులు పెట్టే డబ్బుతో.. పాత పెట్టుబడిదారులకు లాభాలు చెల్లిస్తూ.. మాయచేసినట్లు గుర్తించింది. బినామీల పేరిట దేశవ్యాప్తంగా ఆస్తులు కొన్నట్లు పక్కా ఆధారాలు సేకరించింది. ఈ స్కాంలో ఇప్పటివరకూ ఈడీ రూ.400 కోట్లకు పైగా ఆస్తుల్ని అటాచ్ చేసింది.

# ఏపీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



మార్కాపురం,జూన్,26, (మనం న్యూస్): వెనుకబడిన మార్కాపురం జిల్లాకు కృష్ణా జలాలను అందించి సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 27 జిల్లాకు వస్తున్న సందర్భంగా ఈ పర్యటనలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా పర్యటన సందర్భంగా జిల్లాకు వరప్రదాయినిగా నిలిచిన శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస, పునరుద్ధరణ ప్యాకేజీల చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం గిద్దలూరు సమీపంలోని కృష్ణంశెట్టిపల్లిలో నిర్మించిన సంజీవిని ఆసుపత్రిని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

మార్కాపురం జిల్లాగా అవతరించిన అనంతరం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తొలిసారిగా గిద్దలూరును సందర్శించడం విశేషమన్నారు. ఈ పర్యటన జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా పేర్కొంటూ, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి స్థాయి ప్రయోజనాలు ప్రజలకు అందేలా చర్యలు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై ప్రజల్లో ఆశాభావం నెలకొందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా మార్కాపురం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి వికేంద్రీకరణకు అవకాశం ఏర్పడిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి పర్యటన ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లావాసులు, రైతులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంతో పాటు జిల్లా అభివృద్ధికి తమ మద్దతును తెలియజేయాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు.

# జూలై 1న శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

## ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



శ్రీసిటీ, జూన్ 26 మనం న్యూస్: జూలై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు శ్రీ సిటీలో హీరో మోటార్ కార్ప్ ఏర్పాటు చేయనున్న తమ రెండవ గ్లోబల్ పారట్స్ సెంటర్ కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు , అధికారులు కంపెనీ ప్రతినిధులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను ఎలిప్యాడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటు, ముఖ్యమంత్రి రాకపోకల మార్గం, భద్రతా ఏర్పాట్లు,అలాగే, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 'సమన్వయం'తో అగ్నిప్రమదాలకు చెక్

- ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్



హైదరాబాద్,జూన్ 26(మనం,ప్రత్యేక ప్రతినిధి): విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, విద్యుత్ రంగ నిపుణులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ స్పష్టం చేశారు.జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నగరంలోని గచ్చిబౌలి ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'విద్యుత్ భద్రత సురక్షా చిట్కాలు' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఫైర్ డీజీ మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్ ఈనెల 26 నుండి జూలై 2 వరకు 'విద్యుత్ భద్రతలో అత్యుత్తమత' అనే అంశంపై సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యుత్ భద్రతపై అవగాహన పెంపు, క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం, సురక్షిత విద్యుత్ వినియోగ విధానాలను అనుసరించడం వల్ల ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. విద్యుత్ ప్రమాదాల వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలను తగ్గించేందుకు నివారణ చర్యలను ప్రోత్సహించడం, విద్యుత్ భద్రతా పద్ధతులను బలోపేతం చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, అగ్ని భద్రత బలోపేతం, ప్రజల్లో అవగాహన పెంపు, ఇతర శాఖల భాగస్వామ్యం, మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి, ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు ఎక్స్-అఫీషియో చైర్‌పర్సన్ కె. నంద కుమార్, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) లింగారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# పల్నాడులో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

## ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ముందస్తు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలి

## పల్నాడు ఉన్నతాధికారుల సమీక్షలో ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు



(అమరావతి,జూన్,26,మనం ప్రత్యేక ప్రతినిధి): పల్నాడు జిల్లాలో ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా ఇన్చార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన మంత్రి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని యాక్సిడెంట్ స్పాట్స్ గా గుర్తిస్తూ... అవసరమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి, వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి, భారీ వాహనాలు సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో రోడ్డుపై నిలిచిపోయిన సందర్భాల్లో, వెనుక నుంచి వచ్చే వాహనాలకు ముందుగానే హెచ్చరిక అందేలా వెంటనే భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీకి దిశానిర్దేశం చేశారు.

అవసరమైతే ట్రాఫిక్ సిబ్బంది, క్రేన్లు, అత్యవసర సహాయక బృందాలను వెంటనే రంగంలోకి దించాలని పేర్కొన్నారు. మాచర్ల నగరవనం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబాలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య చికిత్సపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న మంత్రి, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

- మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి
- జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్



అమరావతి/విశాఖపట్నం , జూన్ 26 మనం న్యూస్: వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు.అలాగే, ఎఫ్ సి వి పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# ప్రకృతి పవిత్రత..ప్లాస్టిక్ పంజా విసురుతోంది!

- అమ్మలాంటి పుడమిపై..పొత్తిళ్ల పసిపిల్లలకు ప్రమాదమేనా!!
- వనమాత వంటిపై.. ప్లాస్టిక్ వేసిన విషపు పగ!!
- పచ్చని కలలపై..ప్లాస్టిక్ కురిపించిన కాటు!!



ఉమ్మడి మహబూబ్ నగర్ (ఊరుకొండ) జూన్ 25 (మనం బ్యూరో): స్థానిక మండల పరిధిలోని శుక్రవారం పచ్చని పుడమి..ఎద మీద ప్లాస్టిక్ పంజా విసురుతుంది.నేటి భవిష్యత్తు కిది ప్రమాదకరమేన.ప్రకృతిని కాపాడుకుందాం. పసిడి పొత్తిళ్లను భవిష్యత్తుకు ప్రయాస లేకుండా ప్రశాంతతనిద్దాం.ప్లాస్టిక్ కాలితే పొగ.ప్లాస్టిక్ కూరుకుపోతే నేల విషౌ.అనే నానుడి నేడు,మనం కళ్లారా చూస్తున్నాం అనడంలో అతియో శక్తి లేదు.ప్లాస్టిక్ తాగిన పక్షులు పిట్టల్లా రాలిపోతున్నాయి. ప్లాస్టిక్ సీసాలో పానీయం పరమ ప్రమాదం అంటూ,నేటి సమాజం నినదిస్తూనే ఉంది అడుగడుగునా.ప్లాస్టిక్ పీడ,వదిలితేనే పుడమి పులకరింత పది కాలాల పాటు పదిలం.దీనికి మనం చేయాల్సిందే చిన్న పని,ప్లాస్టిక్ బదులు పత్తి సంచి పట్టుకుందాం,ప్లాస్టిక్ పాకురాయి పాత్రలు వాడుదాం.ప్లాస్టిక్ బదులు అరటి ఆకులు పవిత్రపు విస్తర్లు పరుచుకుందాం.పొద్దు,పొద్దున్నే,పురిటి నొప్పుల్లా పట్టుకొచ్చిన ప్లాస్టిక్ కవర్లు పల్లె పల్లెనా పాకిపోయింది.పాతలిన్ పేరుతో పచ్చని భూమికి పట్టిన పీడ ఇది.పాతాళం వరకు పాతిన ప్లాస్టిక్ పాత బడదు,పాడవదు,పది ఏళ్లయిన ప్లాస్టిక్ కడుపులో పాతుకుపోయి పర్యావరణాన్ని పాడు చేస్తుంది.ఆధునిక మానవ జీవితంలో ప్లాస్టిక్ ఒక అనివార్య భాగమైపోయింది.అదే ప్లాస్టిక్ నేడు ప్రకృతిని నాశనం చేస్తూ మహమ్మారిలా మారింది.'ప్రకృతి ప్లాస్టిక్ పై పంజా విసురుతుంది అనడం అక్షరాల సత్యం.' ప్లాస్టిక్ అనేది చౌక్ అయినా తేలికైనా మన్నికైన పదార్థం కావడంతో మన దైనందిన జీవితంలో భాగమైపోయింది.దీని ప్రత్యేక రసాయన నిర్మాణం వల్ల ఇది ప్రకృతితో సులువుగా కరిగిపోదు వందల సంవత్సరాలైనా అలాగే ఉండిపోయి పర్యావరణ సమతుల్యాను దెబ్బతీస్తుంది.మానవాళికి సౌకర్యంగా మారిన ప్లాస్టిక్ నేడు భూమికి పర్యావరణానికి తీవ్రమైన ముప్పుగా మారింది.విచక్షణ రహిత వాడకం నిర్లక్ష్య నిర్వహణ వల్ల ప్లాస్టిక్ భూమిని నీటిని గాలిని కలుషితం చేస్తూ సమస్త జీవకోటికి ప్రాణ సంకటంగా మారింది.సముద్రాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి తిమింగలాలు తాబేలు వంటి జీవులు చనిపోతున్నాయి.ప్రకృతి కూడా మన నుండి ఏమీ కోరుకొండ వనరులను ఇస్తుంది.మనము చేస్తున్న కాలుష్యాన్ని అడవుల నరికివేతను ప్రకృతి భరిస్తూనే ఉంది.చెట్లు నదులు పర్వతాలు మన మనుగడకు రక్షణ కవచాలుగా నిలుస్తున్నాయి.మానవుడు అత్యాశ వల్ల ఈరోజు ప్రకృతి మాత విలవిలలాడుతుంది.ప్లాస్టిక్ వాడకం రసాయనాల వాహనాల పొగతో కలుస్తమవుతున్నాయి. వనరులన్నీ. కాంక్రీట్,అడవుల కోసం పచ్చని చెట్లను నరికేస్తున్నాం.సకాలంలో వర్షాలు పడకపోవడం మితిమీరిన వేడి పెరగటం వల్ల భూమి వేడెక్కుతుంది.మన పూర్వీకులు మనకు స్వచ్ఛమైన గాలిని పచ్చని పరిసరాలను అందించారు. కానీ మనం మన పిల్లలకు కాలుష్యాన్ని జబ్బులను బహుమతిగా ఇస్తున్నాం. సిమెంటు కట్టడాల మధ్య కాకుండా,పిల్లలు పచ్చని చెట్ల నీడలో ప్రకృతి ఒడిలో ఆడుకునేలా చేయాలి.చిన్నతనం నుంచే పిల్లలకు మొక్కలు నాటడం వాటిని పెంచడం విరివిగా నేర్పించాలి. ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమైన రోజుల్లో కనీసం ఒక మొక్క నాటాలి. సెకిల్ వాడకం,నడవటం పొదుపును చేయడం అలవాటు చేసుకోవాలి.ప్రకృతిని మనం రక్షిస్తే ఆ ప్రకృతి మనల్ని రక్షిస్తుంది.అమ్మలాంటి ప్రకృతి నాశనం చేయడం అంటే మన భవిష్యత్తును మనమే చేతులారా పాడు చేసుకోవడమే.కాబట్టి ఇప్పటికైనా మేల్కొందాం పర్యావరణాన్ని కాపాడుతూ మన పిల్లలకు కాలుష్య రహిత పచ్చని సుందర ప్రకృతిని కవచంగా కానుకగా ఇద్దాం.ఇది పలుకు కాదు పంతం.ఇది మాట కాదు మహా యజ్ఞం.ఇది నినాదం కాదు నిబద్ధత,ఇది వాగ్దానం కాదు,మన వారసులకు మనవిచ్చే పచ్చని భవిత,పవిత్రమైన పుడమి ప్రజలమైన పర్యావరణం.పుడమి తల్లి పవిత్రత కోసం ప్లాస్టిక్ పై సమరం చేద్దాం.పచ్చని భవిత కోసం ప్లాస్టిక్కు పాత రేద్దాం.పుడమి పులకరించాలి,ప్లాస్టిక్ పాతర కావాలి.పుడమి పరవశించాలి.ప్లాస్టిక్ పరాభవం కావాలి.ప్రకృతి పరమేశ్వరుడి ప్రసాదం. పచ్చని చెట్లు,పారే నదులు,పాడే పక్షులు,పుడమి పదహారు కలల పద్మౌ.కానీ ఆ పద్మానికి ప్లాస్టిక్ పురుగు పట్టింది.పవిత్రమైన ప్రకృతిని ప్లాస్టిక్ పెనుభూతం పట్టిపీడిస్తోంది.పర్యావరణ ప్రేమికులు పిలుపునిస్తున్నారు అమ్మలాంటి పుడమి అపవిత్రం చేయవద్దని,ప్లాస్టిక్ భూతాన్ని పాతరేసి పసి పిల్లలకు పచ్చని పుడమిని పంచి పెడదాం.

# రొట్టెల పండగకు తొలిరోజు భక్తుల రద్దీ

## సుదూర ప్రాంతాల నుంచి భారీగా విచ్చేసిన భక్తులు

## పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర సేవలు

## పటిష్ట పోలీసు బందోబస్తు

## పక్కాగా ఏర్పాట్లు ... సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు

## ప్రశాంత వాతావరణంలో రొట్టెలు మార్చుకున్న భక్తులు



(నెల్లూరు నుంచి పి. మీరా హుస్సేన్ , మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు తొలి రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల , ఎస్పీ అజిత వేజండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం... కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

**పటిష్ట బందోబస్తు**

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు 1800 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు.

**పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్**

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి 6 వేలకు పైగా సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్ ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మొదటిరోజు సుమారు 400 మంది పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

**ప్రత్యేకంగా ఆయుష్ వైద్య శిబిరం**

ప్రజలకు ఆయుష్, యునాని, హోమియో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రొట్టెల పండుగలో ప్రత్యేకంగా ఆయుష్ స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరాజు, సరళ హెబ్సిబా, జ్ఞాన ప్రసూన, వినోద్ బాబు వైద్య సేవలు అందించారు. సుమారు 500 మంది ఆయుష్ విభాగం సేవలను వినియోగించుకున్నారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ**

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

**భక్తులందరికీ అన్నదానం**

రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. అలాగే భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని స్టాల్స్ ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు అందజేస్తున్నారు.

**ప్రత్యేకంగా మీడియా పాయింట్**

రొట్టెల పండుగ కవరేజ్ నిమిత్తం దర్గాకు విచ్చేస్తున్న మీడియా వారికి ప్రత్యేకంగా జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా పాయింట్ ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఈ కేంద్రం నుంచి తమ విధులు నిర్వహిస్తూ రొట్టెల పండుగ విశేషాలను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తున్నారు. మీడియా వారికి ప్రత్యేకంగా అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు.

# ‘వందే’ బంకించంద్ర ఛటర్జీ



బంకించంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందేమాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు.

బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసుకోలేదనేది వాస్తవం.

బంకించంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే ‘లలిత ఓ మానస్’ అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 - 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్‌మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది.

దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, ‘వందేమాతరం’ గీత రచన చేసిన తర్వాత దానిని ‘ఆనంద్‌మఠ్’ నవలలో పొందుపరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.

భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది.

**దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, ‘వందేమాతరం’ గీత రచన చేసిన ర తర్వాత దానిని ‘ఆనంద్‌మఠ్’ నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించబడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.**

సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహుముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు.

జూన్ 27...బంకించంద్ర ఛటర్జీ జయంతి

-ఆర్‌కేఎస్

9440595494

# దౌత్యంలో మహిళల ప్రాతినిధ్యం పెంచలేమా !





ఐక్యరాజ్య సమితి తీర్మానం ప్రకారం, ప్రతి ఏటా 24 జూన్ రోజు ప్రపంచ దేశాలు అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ వూమెన్ ఇన్ డిప్లమసీ) పాటించడం 2022 నుంచి ఆనవాయితీగా మారింది. మహిళలు నిర్ణయాధికార స్థానాల్లో ఉండేలా, వారి గొంతు వినిపిం చేలా, వారి కృషికి విలువ ఉండేలా చూసే దశకు మనందరం సాధ్యమైనంతగా కృషి చేయాలని పిలుపునిస్తున్నది ఈ వేదిక. అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం-2026 ఇతివృత్తంగా అందరి కోసం దౌత్యం (డిప్లమసీ ఫర్ ఆల్) అనే అంశాన్ని తీసుకొని సమాజ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సమానత్వ సాధన, శాంతి సహకారాలకు ప్రాధాన్యం ఇస్తూ సమ్మిళిత దౌత్యం కోసం పిలుపునిస్తూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో లింగ సమానత్వం, అసమానతల తగ్గింపు, శాంతి న్యాయ సంస్థలు, లక్ష్యాల సాధనకు భాగస్వామ్యం లాంటి అంశాలను అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం వేదికగా గుర్తు చేసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా దౌత్య రంగంలో మహిళల నాయకత్వ ప్రాతినిధ్యం గణనీయంగా తక్కువగా ఉండడం విచారకరం. క్యాబినెట్ మంత్రులు, విదేశీ వ్యవహారాలు, రక్షణ, భద్రత లాంటి మంత్రిత్వ శాఖల్లో లేదా ఉన్నత రాయబార అధికారుల స్థాయిలో మహిళలు నాలుగింట ఒక వంతు కన్న తక్కువగా 22.9 శాతం మాత్రమే ఉండడం ఓ చేదు నిజం అని తెలుసు కోవాలి.

లింగ సమానత్వంలో కొంత పురోగతి సాధించి నప్పటికీ, దౌత్య అంతర్జాతీయ స్థాయిల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగా ఉండడంతో ఆ రంగాల్లో మహిళామణులను ఆకర్షించడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం ముందుకు రావాలి. కేవలం 25 దేశాల్లో మాత్రమే మహిళా దేశాధినేత లేదా ప్రభుత్వాధినేతలు ఉన్నారు. 113 ప్రపంచ దేశాల్లో ఇప్పటి వరకు దేశాధినేతలు లేదా ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో మహిళలకు స్థానం దక్కలేదు. ఐరాస నియమించిన దౌత్య రంగంలో మహిళలు 21 శాతం వరకు మాత్రమే ఉండడం గమనించాలి. రాజకీయ రంగంలో ఆసక్తి చూపుతున్న మహిళలకు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ వేధింపులు దినదినం పెరుగుతున్నాయి.అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం వేదికగా ఐరాస తీసుకునే చర్యలతో పాటు ఈ అంశంలో ప్రజా అవగాహన, కమ్యూనిటీ ఫోరమ్లు, శిక్షణ కార్యక్రమాలు, యూనివర్సిటీల్లో మహిళా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

రాజకీయ నియామకాలు, దౌత్య కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధనకు కృషి జరగాలి. దౌత్య రంగంలో రాణిస్తున్న మహిళలను సముచితంగా గౌరవిస్తూ, వారిని ప్రజా క్షేత్రంలో సన్మానించాలి. ప్రపంచ శాంతి, సమ్మిళిత ప్రపంచ పాలన, సమాన భాగస్వామ్య సాధన లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

డా.బుర్ర మధుసూదన్ రెడ్డి

9949700037

## ఇపుడీ లోకంలో...

‘హెల్ ఈజ్ ఎంప్టీ,
అండ్ ఆల్ ద డెవిల్స్ ఆర్ హియర్’
‘నరక మంతా శూన్యంగా ఉంది,
దయ్యా లన్నీ ఇక్కడే(ఈ లోకంలోనే) ఉన్నాయి’
అన్నాడు పదహారో శతాబ్దంలోని
ప్రముఖ నాటకకర్త,కవీ విలియం షేక్స్పియర్!
ఈ మాట నూటికి ఎన్నెన్నో రెట్ల నిజం!
ఈ లోకంలో వాళ్ళ యమభయం లేదు కాబట్టి,
మరణమూ లేదు కాబట్టి
మనుషుల్లో ఆవేశిస్తూ తమ దయ్యపు గుణాలను
మనుషులకు నేర్పిస్తూ,దుర్బుద్ధులు
పుష్కలంగా పుట్టిస్తూ,
చనిపోతున్న మనుషుల వదిలిపెట్టి
పుడుతున్న మనుషుల్లోనూ ప్రవేశిస్తూ
ఆ దయ్యాలు తామే మనుషులుగా
ఇప్పటికీ నిర్భయంగా వర్ధిల్లుతున్నాయి,
ఇందుకే మనుషుల్లో ..క్రూరమృగాల
కరళ్ళు కరళ్ళుగా తోటిమనుషులపై క్రూరత్వం!
ఇపుడీ లోకంలో... ఎక్కడ చూసినా
దుర్మార్గమే గర్వంగా
మీసాలు మెలేస్తూన్న అహంకారఘుట్టాలు;
లోకం దృష్టి చాలా మందమైపోయింది,
న్యాయాన్యాయాలనూ,ధర్మాధర్మాలనూ
పాపపుణ్యాలను అసలు గుర్తించడం లేదు,
ముందే ఘోరాలూ,నేరాలూ జరుగుతున్నా
వేడుకదృశ్యాలుగా చూస్తుంది లోకం,
కోటిరావణ,మైరావణసమానశ్వేతవస్త్రధారికి
అన్ని వ్యవస్థలూ దాసోహ మంటున్నాయి
కొంపలు ముంచే తెలివితేటలకే కీర్తికిరీటాలను
తొడుగుతోంది లోకం, నీతీనిజాయితీ
పరులను చూసి ఎగతాళిగా నవ్వుతోంది లోకం
చట్టాలూ న్యాయాదులు బలాలున్నవాళ్ళకే
చుట్టాలవుతున్నాయి
దొడ్డువాడికి రక్షలు, బక్కవాడికి శిక్షలు
మొన్నా,నిన్నా,నేడూ
అమాయకుల,పేదల,నిరుపేదల,
తెలివిలేనివాళ్ళ,బలహీనుల బ్రతుకులే బలి!

-‘రఘువర్మ’

9290093933

# శనీశ్వర పూజతో అంతా శుభమే

**‘నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం..**

**ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్’ !**

భారతీయుల జ్యోతిషశాస్త్రం ప్రకారం ‘శనీశ్వరుడు’, నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు, కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్నగ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు భిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే ‘శని’ ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనివారానికి అధిపతి శనేశ్వరుడు. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనయే క్రమతి, అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడా నికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్రవాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి.

సంఖ్యలలో ‘ఎనిమిది’ శనికి ప్రీతికర మయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూపబోతున్నాడో అని నిరూపించ డానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది.

దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, జన్మరాశి నుండి లగ్నశని, మూడు, ఏడు, పదవ స్థానాలపై శనిదేవుని ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు.

హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమావాస్య రోజు శని జయంతి జరుపుకుంటారు. వారంలో ఒకరోజు అంటే శనివారం నాడు శనీశ్వరుడు శని గ్రహాన్ని పాలిస్తుంటాడు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. అంతే కాకుండా ఈయన శని గ్రహానికి రాజు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు.కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి.

బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన



దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాలగణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసు కోలేక, పార్వతీ దేవి తనకుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని పురాణాలు తెలుపుతున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాస మాడాడట ! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు.

హనుమంతుడు శని దేవుడి లోని ఓంకారాన్ని నాశనం చేసినప్పుడు ఆయన శరీరం పై మచ్చలు గాయాలు అయినాయి. ఆ నొప్పి పోయి, సున్నితంగా తయారవ డానికి, హనుమంతుడు ఇచ్చిన నూనె సాయపడింది.

శని దశ దుష్ప్రభావాలతో బాధపడేవారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. నువ్వుల నూనెతో శనికి అభిషేకం చేయడం, శని త్రయోదశి రోజున ఉపవాసం ఉండడం, రావిచెట్టుకి ప్రదక్షిణాలు చేసి ఆవనూనెతో దీపం పెట్టడం, నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ నూనెను దానం చేయడం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, నల్లని గొడుగు మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి. తాంత్రిక విద్యల ప్రభావం నుంచి రక్షణ కోసం హోమం లేదా యజ్ఞాన్ని జరిపించాలి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు.

శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది.

శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని ‘ఏలినాటి శని‘ లేదా ‘సాడేసాతి’ అంటారు. అలాగే శని నాలుగవ ఇంట, ఎనిమిదవ యింట సంచరిస్తున్నప్పుడు కూడా చెడు ఫలితాలు ఇస్తాడు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఉదాహరణకు ఏ పని లేకుండా, ఖాళీగా తిరుగుతున్న వ్యక్తికి, ఉద్యోగం వస్తే, అది బద్ధకస్తుడు అయిన వ్యక్తికి మొదట కష్టంగా తోచినా, అది మంచి భవిష్యత్తును ఇస్తుంది. కాబట్టి ఆ తర్వాత ఆ కష్టం యొక్క విలువ తెలుస్తుంది. మనం పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది.

మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు. శనివారానికి స్థితి కారకుడైన శ్రీమన్నారాయణుడు అధిపతి , త్రయోదశికి అధిపతి కామదేవుడు. అంటే శివుడు. అలా శివకేశవుల క్రియలకు శని అధిపతి అయ్యాడు. అందుకే శనిత్రయోదశి శనికి ఇష్టమైన రోజు. త్రయోదశి తిథి శివుడికి ఎంతో ప్రీతికరమైనది. క్షీరసాగర మదనం జరిగి అమృతం ఉద్భవించిన తరువాత, హాలా హలాన్ని దిగమింగి తన కంఠంలో దాచుకొని లోకాలను కాపాడిన శివుడికి కృతజ్ఞతలు చెప్పడానికి దేవతలందరూ ఆయన వద్దకు వెళ్ళినది ఈ త్రయోదశి తిథి నాడే అని పురాణాల ద్వారా తెలుస్తుంది.

శని త్రయోదశి ప్రదోష సమయాన శివుడికి అభిషేకం చేయడం చాల విశేషంగా లబిస్తుంది. ఈ సమయంలో శివుడికి చేసే పూజలు అత్యంత ఫలితాలనిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

- రామ కిష్టయ్య సంగన భట్ల

9440595494

# నిజాం నుంచి నేటి తెలంగాణ వరకు... ప్రజల విముక్తి ఏది?



తెలంగాణ చరిత్రను కేవలం పాల కుల చిట్టాగానో, అధికార మార్పిడిల కథనంగానో చూస్తే అది అసంపూర్ణమే అవుతుంది. ఇది రాజుల గాథ కాదు, ఇది తిరుగుబాటుదారుల గీతం. అణచివేతకు వ్యతిరేకంగా తరతరాలుగా ఎగిసిపడుతున్న చైతన్య తరంగాల చరిత్ర ఇది. ఈ నేలపై ప్రతి తరం తన కాలంలోని అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించింది. ఆత్మ గౌరవం కోసం, మనిషిగా హక్కుల కోసం అహరహం పోరా డింది. అయితే, నిజాం కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య యుగం వరకు దశాబ్దాలు గడిచినా, పాలకులు మారారు, ప్రభుత్వాలు మారాయి, కానీ తెలంగాణ ప్రజల జీవితాల్లో ‘నిజమైన విముక్తి’ ఎంతవరకు సాధ్యమైందన్నది నేడు తెలంగాణ పౌర సమాజం ముందున్న అత్యంత సంక్లిష్టమైన, చారిత్రకమైన ప్రశ్న.

నిజాం పాలనను నేడు ఒక వర్గం పూర్తిగా చీకటి యుగంగా చిత్రీకరిస్తే, మరొక వర్గం దానిని అభివృద్ధి యుగంగా కీర్తిస్తోంది. వాస్తవానికి, ఈ రెండు అభిప్రాయాలు చారిత్రక వాస్తవాలను దాటవేసేవే. హైదరాబాద్ సంస్థానంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, నిజాం సాగర్ వంటి ఆధునిక కట్టడాలు, రైల్వేలు, వైద్య సంస్థలు వెలిశాయి. కానీ, అదే సమయంలో ఆ ఆధునికత వెనుక గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దొరల నిరంకుశత్వం, వెట్టిచాకిరి, అమానవీయమైన సామాజిక అణచివేత తాండవించాయి. నగరాల్లో ఆధునిక విద్యుత్ దీపాలు వెలుగుతుంటే, పల్లెల్లో రైతాంగం దోపిడీ చీకట్లలో మగ్గిపోయింది. ఈ వైరుధ్యమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పునాది వేసింది. ఆ పోరాటం కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కోసం కాదు.. మనిషిగా గౌరవం కోసం, దోపిడీని అంతం చేయడం కోసం జరిగిన ఒక సామాజిక విప్లవం.

1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడం ఒక కీలక మలుపు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది, రాజ్యాంగ హక్కులు సంక్రమించాయి. కానీ, గ్రామీణ సమాజంలోని అధికార నిర్మాణంలో ఆశించిన మార్పు రాలేదు. నిజాం కాలం నాటి భూస్వామ్య వర్గాలు కొత్త రాజకీయ పార్టీల ముసుగులో అధికారాన్ని కైవసం చేసుకున్నాయి. దొరలు, జాగీర్దారులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా అవతారమెత్తారు. రాజ్యం మారింది, కానీ గ్రామీణ శక్తి సంబంధాలు, దోపిడీ స్వభావం అలాగే ఉండిపోయాయి. ఆ తర్వాత 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం తెలంగాణకు మరో పెద్ద అన్యాయానికి దారితీసింది. ప్రాంతీయ అసమానతలు, వనరుల పంపిణీలో జరిగిన వివక్ష 1969 ఉద్యమానికి బీజాలు వేశాయి. తెలంగాణకు జరిగిన అన్యాయం కేవలం ప్రాంతీయమైనది కాదు, అది వనరుల పంపిణీలో జరిగిన వర్గ అన్యాయం.

1991 తర్వాత దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ తెలంగాణ సామాజిక వ్యవస్థను మరింత తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రజా రంగం బలహీనపడటంతో రైతాంగ సంక్షోభం, నిరుద్యోగం, వలసలు విలయతాండవం చేశాయి. సహజ వనరులు మార్కెట్ శక్తుల నియంత్రణలోకి వెళ్లిపోయాయి. ఈ క్రమంలోనే 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ఒక చారిత్రక విజయం. కానీ, ప్రజలు కోరుకున్నది కేవలం పాలకుల మార్పు కాదు. వారు ఆశించింది ఉద్యోగాలు, భూమి, సామాజిక న్యాయం, అందరికీ సమానమైన విద్య, వైద్యం. గత దశాబ్దాన్ని పరిశీలిస్తే, అభివృద్ధి హైదరాబాద్ కేంద్రంగా, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం సాగింది. గ్రామీణ తెలంగాణ ఇంకా సంక్షోభంలోనే ఉంది. 2023లో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారు, కానీ ఇప్పటికీ పాలనా దృక్పథంలో మౌలికమైన మార్పు రాకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఇక్కడే తెలంగాణ పౌర సమాజం తన చారిత్రక బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది. పౌర సమాజం అంటే కేవలం స్వచ్ఛంద సంస్థలు కాదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రచయితలు, కళాకారులు, దళిత-బహుజన ఉద్యమకారులు ఇలా ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలి. ప్రజలు మౌనంగా ఉన్నప్పుడు పాలక వర్గాలు మరింత బలపడతాయి, ప్రజలు సంఘటితమైతేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.



మార్క్సిస్టు వర్గ దృక్పథంలో చూసినప్పుడు, తెలంగాణ సమస్య కేవలం ప్రాంతీయమైనది కాదు; అది ఒక లోతైన వర్గ సమస్య. ఉత్పత్తి చేసే శ్రమజీవులు ఒకవైపు, ఆ లాభాలను దోచుకునే పాలకుల వర్గం మరోవైపు ఉన్న ఈ సమాజంలో, ఈ వైరుధ్యాన్ని పరిష్కరించకుండా సమాన తెలంగాణ నిర్మాణం అసాధ్యం.

రాజ్యాలు మారాయి, ప్రభుత్వాలు మారాయి, కానీ తెలంగాణ ప్రజల విముక్తి ప్రయాణం ఇంకా గమ్యం చేరుకోలేదు. సామాజిక న్యాయం, విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగిన ఈ సుదీర్ఘ ప్రయాణం నేటికీ కొనసాగుతూనే ఉంది.

నిజాం పాలనను సవాలు చేసినట్లే, ఉమ్మడి రాష్ట్రంలోని అన్యాయాలను ఎదిరించినట్లే, నేటి వ్యవస్థలోని అసమానతలను సవాలు చేయాల్సిన చారిత్రక కర్తవ్యం నేటి తరం ముందుంది. చరిత్రలో ప్రతి ముందడుగు ప్రజా పోరాటాల ద్వారానే వచ్చింది. అదే బాటలో, పౌర సమాజం మరోసారి చైతన్యవంతమైన పాత్ర పోషించాల్సి ఉంది. ఆ ప్రయాణాన్ని గమ్యానికి చేర్చే బాధ్యత, ఆ గతాన్ని పాఠంగా మార్చుకుని భవిష్యత్తును నిర్మించే చారిత్రక బాధ్యత నేటి తెలంగాణ సమాజానిదే.

- మామిండ్ల రమేష్ రాజా

7893230218

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పెద్దపల్లి, జూన్ 26 (మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహిస్తున్నట్లు, ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో



చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలని, ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈకార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని,అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**మహిళా కాంగ్రెస్ ను మరింత పటిష్టం చేయాలి**
**కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమలాక్షి, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**
**కాట సుధా అధ్యక్షతన మహిళా కాంగ్రెస్ జిల్లా సమావేశం**
**పాల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్**





పటాన్ చెరు, జూన్ 26 (మనం న్యూస్) : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తోందని మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమలాక్షి, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం రామచంద్రపురం పరిధిలోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో మహిళా కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన మహిళా కాంగ్రెస్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమలాక్షి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలాక్షి, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తుందని తెలిపారు. మహిళా కాంగ్రెస్ ను సంస్థాగత బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళల భాగస్వామ్యాన్ని పార్టీ కార్యక్రమాల్లో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు శాసనసభ, పార్లమెంట్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును కేంద్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని మహిళ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మహిళల రాజకీయ సాధికారతకు ఈ బిల్లు కీలకమని, ఇప్పటికే చట్టరూపం దాల్చిన ఈ బిల్లును ఆలస్యం చేయకుండా అమలు చేసి మహిళలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్, పటాన్ చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, నాయకులు సుధాకర్ గౌడ్, పెద్ద ఎత్తున మహిళా కాంగ్రెస్ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలను పాడు చేసుకోవద్దు


- **విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలి**
- **గజ్వేల్ సిఐ రవికుమార్**

గజ్వేల్, జూన్ 26 (మనం న్యూస్)ః మాదక దవ్యాల బారిన పడి జీవితాలను పాడు చేసుకోవద్దని గజ్వేల్ సిఐ రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది దీనిలో భాగంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా పోలీసు కమిషనర్ రశ్మి పెరుమాళ్ మరియు ఈగుల్ ఫోర్స్ తెలంగాణ ఆదేశాల మేరకు సిగ్నేచర్ ఛాంపియన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా సే నో టూ డ్రగ్స్ సందర్భంగా సిగ్నేచర్ కాంపెయిన్ నిర్వహించారు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యువతను పెను ముప్పుగా వేధిస్తున్న డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా రక్షించడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రతి ఏటా జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారు. మాదకద్రవ్యాల వినియోగం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, ఒక పూర్తి కుటుంబాన్ని, తద్వారా యావత్ సమాజ ఉత్పాదకతను నాశనం చేస్తుంది. శాంతిభద్రతల సమస్యలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు విద్యాసంస్థలు సంయుక్తంగా కౌన్సిలింగ్ కేంద్రాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. యువత తమ విలువైన జీవితాన్ని పాడుచేసే ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండి, మానసిక శారీరక దృఢత్వాన్ని పెంచే క్రీడలు, సృజనాత్మక రంగాల వైపు అడుగులు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు.




# పార్కులతో ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం

**అమీన్ పూర్ డివిజన్ పరిధిలో రూ. ఒక కోటి 51 లక్షలతో 3 పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరు, జూన్ 26 (మనం న్యూస్) : పార్కులు ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, హెచ్ఎంటి శిల్ప లేఔట్ కాలనీ, పిఎన్ఆర్ కాలనీలలో ఒక కోటి 51 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో గల ప్రతి పార్కు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఆహ్లాద వాతావరణంలో పాటు పచ్చదనం పెరగడంతో పాటు కాలనీలలో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. ప్రతి పార్కులో పిల్లలకు ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ సురేష్, డి ఈ వెంకటరమణ, పార్కుల విభాగం మేనేజర్ సతీష్, మాజీ కౌన్సిలర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్, జగదీష్, కృష్ణ, మహదేవ రెడ్డి, రాములు, బిజిలి రాజు, కాట సునీత, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

# రాజయ్యనగర్‌లో తాగునీటి గోస

**చుక్కనీరు దొరక్క అల్లాడుతున్న గిరిజనం**
**మూలనపడ్డ సోలార్ పథకం**
**పని చేయని చేతిపంపులు**
**30 కుటుంబాలకు చెలిమ నీరే దిక్కు**







చర్ల, జూన్ 25 (మనం న్యూస్) : పాలకులు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదు. నడిచేందుకు రహదారి, తాగేందుకు నీరు, బతుకు భరోసాకు విద్య వారికి అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఏ ఆదివాసీ గ్రామం చూసినా అక్కడి గిరిజనానికి తాగేందుకు చుక్కనీరు దొరకడం లేదు. వారి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన సోలార్ రక్షిత మంచినీటి పథకాలు, చేతి పంపులు మూలన పడ్డాయి. వీటిని బాగుచేసే వారులేక ఆయా గ్రామాల గిరిజనం తాగునీటికి గోసపడుతున్నారు. మండలంలోని రాజయ్యనగర్ గిరిజనులు పడుతున్న తాగునీటి కష్టాలపై 'మనం' అందిస్తున్న ప్రత్యేక కథనం. సుబ్బంపేట గ్రామ పంచాయతీ రాజయ్యనగర్ గ్రామం దశాబ్దంన్నర క్రితం ఏర్పడింది. ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా, బీజపూర్ జిల్లాల నుండి సుమారు 25 కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామం రిజర్వ్ ఫారెస్ట్ లో ఉండటంతో వీరికి మిషన్ భగీరథ పైప్ లైన్ వేసేందుకు అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదు. దీంతో ఇక్కడి గిరిజనం దాహార్తి తీర్చేందుకు సోలార్ ఆధారిత రక్షిత మంచినీటి పథకం, మూడు చేతి పంపులను వేసారు. తరచూ సోలార్ మంచినీటి పథకం మరమ్మత్తులకు గురవుతోంది. మూడు చేతి పంపులలో రెండు మూలనపడగా ఒక్క పంపు నుండి చాలీచాలని నీరు వస్తోంది. దీంతో తాగునీరు దొరక్క ఇక్కడి ఆదివాసీలు మండు వేసవిలో అవస్థలు పడ్డారు. చేసేది లేక గ్రామ సమీపంలోని వాగులో రెండు చెలిమలను తవ్వుకుని ఆ నీటిని తాగి తమ దాహాన్ని తీర్చుకుంటున్నారు. గుట్టల నుండి సన్నని నీటిదార ద్వారా వాగులోకి నీరు చేరుతోంది. ఈ నీరు నిల్వ ఉండటంతో దాని పక్కనే చెలిమ తవ్వుకుని ఆ నీటిని తాగాల్సి వస్తోంది. దీంతో ఇక్కడి గిరిజనులు తరచూ డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామ మహిళలు బిందెల ద్వారా నీటిని తెచ్చుకొని తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. గ్రామంలో నీటి సమస్య ఉన్నదని తెలిసినా మిషన్ భగీరథ అదికారులు తమవైపు కన్నెత్తి చూడడం లేదని గిరిజనులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికయినా స్పందించి సోలార్ రక్షిత మంచినీటి పథకం, చేతి పంపులకు మరమ్మత్తులు చేసి తమ దాహార్తి తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మిడ్జిల్లో మొహరం మహోత్సవం.. కులమతాలకు అతీతంగా పీర్ల పండుగ ఘనంగా..!



మహబూబ్ నగర్ జూన్ 26 (మనం ప్రతినిధి) :నియోజకవర్గం మిడ్జిల్ మండలంలో మొహరం (పీర్ల) పండుగ భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా, సోదరభావాన్ని చాటుతూ ఘనంగా నిర్వహించారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా హిందూ, ముస్లిం సహా అన్ని వర్గాల ప్రజలు ఒకే వేదికపై కలిసికట్టుగా పాల్గొని సామరస్యానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం విశేషంగా నిలిచింది.

మండలంలోని పీర్ల దర్గా ప్రాంగణాలు, వీధులు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ప్రజలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి, కలాపి చల్లి, పండుగకు స్వాగతం పలికారు. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడగా, ప్రతి వీధిలో భక్తి, ఆనందం, ఉత్సాహం వెల్లివిరిసింది.

పీర్లకు ప్రత్యేక పూజలు, మొక్కులు, ప్రార్థనలు నిర్వహించగా, మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డప్పుల చప్పుళ్లు, సంప్రదాయ వాద్యాలు, భక్తి నినాదాలతో మిడ్జిల్ పట్టణం మారుమోగింది. పీర్ల ఊరేగింపులు కనుల పండువగా సాగి ప్రజలను ఆకట్టుకున్నాయి.

'మతం వేరు కావొచ్చు... మనసు ఒక్కటే' అనే సందేశాన్ని ఈ పండుగ మరోసారి చాటిచెప్పింది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మొహరం పండుగను నిర్వహించడం మిడ్జిల్ ప్రాంతంలో నెలకొన్న సామరస్యానికి, పరస్పర గౌరవానికి నిదర్శనంగా నిలిచింది.

ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ఐక్యతను చాటుకోవడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మిడ్జిల్లో ఎటు చూసినా పండుగ సందడి నెలకొనగా, భక్తుల రద్దీతో పట్టణమంతా ఉత్సాహభరితంగా మారింది.స్థానిక పెద్దలు మాట్లాడుతూ, 'పీర్ల పండుగ కేవలం ఒక మతానికి సంబంధించినది కాదు.. ఇది మన సంస్కృతిలో భాగమైన సామరస్యం, సోదరభావానికి ప్రతీక. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయి' అని పేర్కొన్నారు.

మిడ్జిల్లో ఘనంగా జరిగిన మొహరం వేడుకలు మతసామరస్యం, సామాజిక ఐక్యత, పరస్పర గౌరవానికి సజీవ నిదర్శనంగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నాయి.

# 28న జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి



- **సర్ పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి**
- **మంత్రి కోమటిరెడ్డి సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు**
- **నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**
- **సీఎం బహిరంగ సభకు భారీగా తరలిరావాలి**

నల్గొండ --జూన్ 26( మనం ప్రతినిధి ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 28న కనగల్ మండల కేంద్రంలో 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే ఆర్ బి హ్యం రోడ్ల పనుల పైలాన్ శంకుస్థాపన అనంతరం ఎన్జీ కళాశాలలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో నలగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అధ్యక్షతన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం మరియు సర్ పై నల్లగొండ పట్టణ, మండలానికి సంబంధించి పార్టీ ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందజేస్తుందని తెలిపారు ఈనెల 28న జరిగే సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. ఈ సభకు పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ₹ ఓటరు సవరణ కార్యక్రమం (సర్ ) పై ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కేంద్రం తనకు అనుకూలంగా లేని ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలంతా దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈనెల 28న ఎన్జీ కళాశాలలో నిర్వహించే బహిరంగ సభకు నల్గొండ నియోజకవర్గం నుంచి 60 వేల మందికి పైగా జన సమీకరణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి గారు కనగల్ వద్ద హ్యం రోడ్ల నిర్మాణానికి సంబంధించి పైలాన్ తో పాటు రూ. 250 కోట్లతో మెడికల్ కళాశాల నుంచి దుప్పలపల్లి వరకు నిర్మించే హ్యం రోడ్డుకు కూడా శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

జ నల్గొండ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. రూ.430 కోట్లతో ఎస్ఎల్బీసీ కాలువ లైనింగ్ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు.

బహిరంగ సభలో పాల్గొనే సీఎం రేవంత్ రెడ్డి గారు నల్గొండ నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి పనులు ప్రకటిస్తాడని తెలిపారు. బహిరంగ సభను ఊహించని స్థాయిలో విజయవంతం చేసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి పేరు నిలబెట్టాలని కోరారు. ఈ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి₹ లు మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు, ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్ని విధాలుగా అండగా ఉంటున్నాడని తెలిపారు.

నిరంతరం నల్గొండ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నాడని అన్నారు.

బహిరంగ సభ విజయవంతం కోసం పార్టీ ప్రజా ప్రతినిధులంతా శక్తివంతన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నల్లగొండ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, తిప్పర్తి,నల్లగొండ పిఎసిఎస్ చైర్మన్ లు ఆలకుంట నాగరత్నం రాజు, పాశం సంపత్ రెడ్డి,పలువురు కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# మతసామరస్యానికి ప్రతీక మొహరం

**పీర్ల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల**

**ప్రజలకు షర్బత్ పంపిణీ చేసిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, షఫీ హఫీజ్**




సంగారెడ్డి జూన్ 26 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి లో మొహర్రం ఘనంగా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా జగ్గారెడ్డి పాత బస్టాండ్ సమీపంలో దర్గా ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల ఊరేగింపు లో పాల్గొన్నారు.పీర్ల ఊరేగింపు చూసేందుకు వందల సంఖ్య లో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కుల మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు మొహర్రం వేడుకలు చెప్పుకుంటారని మహమ్మద్ ప్రవక్త మనుమడు వీరమరణం పొందిన రోజు సందర్భంగా శోక సముద్రం తో ఆయన త్యాగం స్మరిస్తూ ఈ వేడుకను జరుపుకుంటారని అన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగా నే ఈ సారి మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు. కూన సంతోష్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, మైనార్టీ నాయకులు తాహెర్, కుతుబుద్దీన్, నదీం, కౌసర్, ఇమ్రాన్, ఆమెర్ జాన్, హకీమ్, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం

ఢిల్లీ జూన్ 26 మనం ఉత్తరాంధ్ర బ్యూరో: టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 'భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు' అని ఆయన తెలిపారు. ఈ 'ఈజీ కనెక్ట్' వ్యూహంతో 2030 నాటికి భారత్ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా

# ముఖ్యమంత్రిను కలిసిన బిజెపి నేత తుగ్గలి నవీన్ రెడ్డి



**తుగ్గలి, జూన్ 26:(మనం న్యూస్ ):** జొన్నగిరి గోల్ మైన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేత తుగ్గలి నవీన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జొన్నగిరి గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభం రాయలసీమ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని తుగ్గలి నవీన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉపాధి హామీ శ్రామికులమంతా ఒకే కుటుంబం



- మంత్రి నిమ్మల
- కుటుంబ సమేతంగా భోజనాలు ఏర్పాటు
- మహిళలకు చీరలు అందజేత.

**పాలకొల్లు, జూన్ 26,మనం ప్రతినిధి:** ఉపాధి హామీ శ్రామికులు, మనమంతా ఒకే కుటుంబమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పేదల సేవే లక్ష్యంగా పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం సొంత గ్రామంలో ఉపాధి హామీ శ్రామికుల శ్రమను గుర్తించి వారికి గౌరవం కలిగేలా కుటుంబ సమేతంగా ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. వేసవిలో మండుటెండలో కష్టపడి పనిచేసిన శ్రామికులకు ప్రతిరోజు చల్లటి మజ్జిగ అందించాలని మంత్రి రామానాయుడు ఇచ్చిన పిలుపును అందుకొని దాతల సహకారంతో దాదాపు రెండు నెలలకు పైగా అందజేశారు. పని ముగింపు సందర్భంగా అన్ని గ్రామాల్లో పిక్నిక్ మాదిరిగా అందరికీ భోజనాలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన భోజనాలు కార్యక్రమంలో మంత్రి నిమ్మల ఆయన సతీమణి సూర్య కుమారి, కుమార్తె శ్రీజాలతో కలిసి పాల్గొని వారితో కలిసి స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శ్రామికులతో కలసి కొంతసేపు సమయం గడిపిన మంత్రి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లక్కీ డ్రా ద్వారా మరియు మహిళా శ్రామికులకు చీరలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెడుతోందని మంత్రి తెలిపారు. రెండు సంవత్సరాల పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. విష రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాల ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేస్తూ మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు అందిస్తున్నామని వివరించారు. మహిళలకు సంవత్సరానికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమం లో పాలకొల్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈఓ జి.వీరాస్వామి, వేంకటేశ్వరరావు, మేడిది జాన్ డేవిడ్ రాజు, గిడుగు కిరణ్, ఉంగరాల నరసింహ రావు, కావాలి నాయుడు, కోర వాసు, సోడ దాసి శేఖర్, రాయి ప్రసాద్, నిమ్మల శ్రీధర్, ఇనుకొండ వెంకటేష్, ఉంగరాల సూర్య నారాయణ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి



- తోట సీతారామలక్ష్మి

**భీమవరం, జూన్ 26 (మనం న్యూస్):** స్థానిక నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజవర్గ తెదేపా ఇన్చార్జ్, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి పాల్గొని ప్రజల నుండి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు అక్రమాలు, అన్యాయాలు అరాచకాలు, హత్య, నీచ రాజకీయాల విసిగిపోయి ఎన్డీఏ కూటమికి అఖండ మెజార్టీతో గెలిపించారని అన్నారు. రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. తెదేపా రాష్ట్ర మాజీ కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ ప్రజా సమస్యల వేదిక ద్వారా నియోజకవర్గ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలోని అన్ని ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పామర్తి వెంకటరామయ్య, ఉప్పులూరి చంద్రశేఖర్ చెరుకుపల్లి సంతోష్, కుమార్ ఎండి షబీనా, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకురి రామలింగరాజు, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముద్దుల రాము, చల్లబోయిన గోవింద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానంలో ప్రైవేట్ సెక్యూరిటీపై పర్యవేక్షణ కరువు?





- నెలకు రూ.10 లక్షలు చెల్లిస్తున్నా భక్తుల భద్రతపై అనుమానాలు!

**అన్నవరం, జూన్ 26, మనం న్యూస్:** అన్నవరం దేవస్థానంలో కొండపై, కొండ దిగువన కలిపి సుమారు 100 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు వివిధ పాయింట్లలో విధులు నిర్వహిస్తున్నారు. భక్తుల భద్రత, దేవస్థానం ఆస్తుల సంరక్షణ, రద్దీ నియంత్రణ వంటి కీలక బాధ్యతలను వీరికి అప్పగించారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి ప్రతినెలా సుమారు రూ.10 లక్షల వరకు జీతాల రూపంలో దేవస్థానం వ్యయం చేస్తున్నప్పటికీ, కొందరు గార్డులు విధులకు గైర్హాజరవడం, మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మ్యాక్స్ సెక్యూరిటీతో పాటు మరో ఏజెన్సీ కూడా సేవలు అందించగా, ప్రస్తుతం మొత్తం భద్రతా బాధ్యతలను మ్యాక్స్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తోంది. దేవస్థానం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పాయింట్ల వారీగా సిబ్బందిని నియమించింది. ఇటీవల బయోమెట్రిక్ హాజరు పరిశీలనలో కొందరు సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన దేవస్థానం ఈవో స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సంబంధిత సిబ్బంది జీతాల్లో కోత విధించినట్లు సమాచారం. అయినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను కఠినంగా అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటేనే దేవస్థానం భద్రతా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు... సూపర్వైజర్ల పర్యవేక్షణ ఎక్కడ?**

అన్నవరం దేవస్థానంలో రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. వ్రత మండపాలు, దర్శన క్యూలైన్లు, కేశఖండనశాల, ప్రసాద విక్రయ కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి కీలక ప్రాంతాల్లో కొందరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని పాయింట్ల వారీగా కేటాయించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపర్వైజర్లపై ఉన్నప్పటికీ, వారు సమర్థవంతంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండా, కేవలం పేరుకే పర్యవేక్షణ చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులకు వాస్తవ పరిస్థితులు తెలియజేయకుండా, అన్నీ సక్రమంగానే ఉన్నట్లు చూపిస్తూ సూపర్వైజింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని భక్తులు అంటున్నారు. ఇప్పటికే బయోమెట్రిక్ హాజరు, ఆకస్మిక తనిఖీల్లో లోపాలు బయటపడినా, భద్రతా వ్యవస్థలో పూర్తిస్థాయి మార్పు కనిపించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పండుగలు, సెలవు రోజుల్లో భారీ రద్దీ ఉన్న సమయంలో ఇది మరింత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు.

# పాలకొల్లులో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం




- భారీ అవగాహనా ర్యాలీ

**పాలకొల్లు, జూన్ 26, మనం ప్రతినిధి :** ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా, నేడు పాలకొల్లు పట్టణంలోని బాలుర వసతి గృహం నుండి మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాసరావు, పాలకొల్లు టౌన్ సీఐ శ్రీ రజనీకుమార్ మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను మరియు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

మాదక ద్రవ్యాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ లేదా పోలీసు శాఖకు తెలియజేసి, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన ర్యాలీలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్ఐలు రఘు, శ్రీ మహేష్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది, పాలకొల్లు టౌన్ సీఐ రజనీకుమార్, పోలీసు సిబ్బంది, టాక్సీ డ్రైవర్లు, బాలుర వసతి హాస్టల్ విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ



**భీమవరం, జూన్ 26 (మనం న్యూస్) :** జనషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరం పాత బస్టాండ్ వద్ద అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు యువత మరియు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్ దెబ్బతింటాయని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని భీమవరం ఎక్సైజ్ సీఐ బలరామరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇనస్పెక్టర్లు ఉమా మహేశ్వరరావు, సునీల్ కుమార్, సిబ్బంది, స్థానిక యువత, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# తెదేపా కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం

- పాల్గొన్న పొత్తూరి రామరాజు



**నరసాపురం, జూన్ 26 (మనం న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమంలో సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీలలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపడం జరుగుతుందని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పొత్తూరి రామరాజు పార్టీ నాయకులతో కలిసి పాల్గొని సమస్యలపై నియోజకవర్గ ప్రజల నుండి అందిన వినతులను, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తల నుండి ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రైనేజీలు తదితర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని అందిన ప్రతి సమస్యను సవివరంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, పార్టీ మండల అధ్యక్షుడు వాతాడి ఉమా మహేశ్వరరావు, షేక్ హుస్సేన్, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, నాగిన రాంబాబు, దొంగ మురళి, బోరా చిన్నాయమ్మ, చీకట్ల కనకదుర్గ, అలివేలు మంగతాయారు తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎమ్మెల్యే ఆనందరావు పుట్టినరోజు వేడుకలు

**అమలాపురం జూన్ 26 మనం న్యూస్:** అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలు మరియు కూటమి ప్రభుత్వం విజయవంతంగా 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సూరసేన యానాం, ఆంధ్రా గోవా 'కోకో బీచ్' వద్ద నిర్వహించిన విజయోత్సవ విందు కార్యక్రమానికి కూటమి శ్రేణులు, బిజెపి నాయకులు, జనసైనికులు, తెలుగు తమ్ముళ్లు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సముద్రపు అలల సవ్వడి మధ్య, జై హో కూటమి.. జై ఆనందరావు అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో కోకో బీచ్ పరిసర ప్రాంతాలన్నీ పండగ వాతావరణాన్ని తలపించాయి .ప్రియతమ ఎమ్మెల్యే కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకను అత్యంత వైభవంగా జరిపారు

# వెన్నెలను సత్కరించిన షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం



**ముమ్మిడివరం,జూన్ 26,మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, ముమ్మిడివరం మండల శాఖ ఆధ్వర్యంలో మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన తానేలంక ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి ఫలితాలలో 580 /600 మార్కులతో ముమ్మిడివరం మండలంలో మొదటి స్థానం పొందిన తానేలంక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని జగడం వెన్నెలకు 5000/- రూపాయలు నగదు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో, అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు ఇచ్చి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తానేలంక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.శకుంతల మాట్లాడుతూ జగడం వెన్నెల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకుని మంచి ఉన్నత చదువులు చదివి మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.వి.రమణ, కాశీ జగజ్జీవన్ రామ్, కాశి వెంకటాచార్య, జనిపల్లి బాలకృష్ణ, కటికదల రాము, మేడిద లక్ష్మణ్ కుమార్, చికిలే తిరుపతిరావు ,జగడం భైరవ స్వామి, జిల్లెల్ల శ్రీధర్, యు. దశరధ రామయ్య మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సౌరడ్స్ స్వచ్ఛంద సంస్థ వారిచే వైద్య శిబిరం



**కాట్రేనికోన జూన్ 26 మనం ప్రతినిధి:** ఎస్ ఏ ఆర్ డి ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో శ్రీంప్ సినర్జీ ప్రాజెక్ట్ ద్వారా కాట్రేనికోన మండలం, నాగపట్నం గ్రామం లో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ క్యాంప్ కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది, దిశా వెహికల్ సిబ్బంది, రెడ్ క్రాస్ సిబ్బంది, డి ఎం అండ్ హెచ్ ఓ సిబ్బంది వారందరితో కలిసి 136 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో కంటి పరీక్షలు, జనరల్ చెకప్స్, గైనకాలజీ పరీక్షలు, ఈసీజీ పరీక్షలు, షుగర్, బి పి పరీక్షలు, మరియు రక్త పరీక్షలు చేయడం జరిగింది. ఇద్దరికి కళ్లజోళ్ళు పడతాయి అని, నలుగురికి కంటి ఆపరేషన్ తప్పనిసరి అని నిర్ధారణ జరిగింది. 39 మందికి రక్త పరీక్షలు చేయగా వారి యొక్క రిపోర్ట్స్ అన్నీ బాగానే ఉన్నాయి. ఈ కార్యక్రమం లో పెదసింగు శ్రీనివాసరావు ఓలేటి మార్రాజు పాళ్ళ సత్యం. ఓలేటి, నర్సింహామూర్తి సౌరడ్స్ సంస్థ డీపీఎం నాగార్జున, దిశా వెహికల్ కౌన్సిలర్ రమ్య, కిమ్స్ పి ఆర్ ఒ ప్రసాద్, పి ఆర్ ఒ ధర్మా, ఆశా సూర్య కళ, మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అవిలాలలో రూ.100 కోట్ల వివాదాస్పద భూమి పరిశీలన

**భూమి పరిశీలనకు వెళ్లిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత**



**తిరుపతి రూరల్ జూన్ 26 మనం న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గంలోని అవిలాల గ్రామంలో విలువైన భూమి వ్యవహారం మరోసారి రాజకీయ దుమారం రేపింది. వృద్ధ దంపతులకు చెందిన 3 ఎకరాల 17 సెంట్ల భూమిని కూటమి నాయకులు అక్రమంగా కబ్జా చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆరోపించారు. ఈ భూమి ప్రస్తుతం సుమారు రూ.100 కోట్ల విలువ చేస్తుందని పేర్కొన్నారు. కబ్జా జరిగిన భూమిని పరిశీలించేందుకు శుక్రవారం అవిలాలకు చేరుకున్న మోహిత్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యకర్తలు నిరసనకు దిగగా, పోలీసులు వారిని బయటకు పంపించే ప్రయత్నం చేశారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం మీడియాతో మాట్లాడిన మోహిత్ రెడ్డి.. 1954 నుంచి ప్రభుత్వ భూమిగా నమోదైన భూభాగాన్ని రాత్రికి రాత్రే పట్టా భూమిగా మార్చి, అశోక్ అనే వ్యక్తి పేరుతో జీపీఏ చేసి రిజిస్ట్రేషన్లు నిర్వహించారని ఆరోపించారు. భూమి ముందు భాగంలో ఉన్న ఆర్చ్ కాలువ పొరంబోకు భూమికి సైతం సేల్ డీడ్లు ఎలా జరిగాయని ప్రశ్నించారు. కాలువ పొరంబోకు భూమికి తుడా అనుమతులు ఎలా మంజూరయ్యాయనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో చేసిన మంచి ప్రజల్లోకి తీసుకెళ్లండి.. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా

**మౌర్య ఇన్ లో రెండేళ్ల పాలనపై కర్నూలు నియోజకవర్గ విజయోత్సవ సభ**

**కర్నూలు జూన్ 26 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో కర్నూలు నియోజకవర్గ పరిధిలో ఊహించని విధంగా అభివృద్ధి చేశామని, దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. మౌర్య ఇన్ లోని ఆయన కార్యాలయంలో కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గీతా మాధురి, బీజేపీ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్, కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి అర్షద్, నాయకులు పవన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ కర్నూలు నియోజకవర్గంలో 33 వార్డుల్లో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. క కర్నూల్ లోని సి క్యాంప్ ప్రభుత్వ క్వార్టర్స్ లో హైకోర్టు బెంచ్ తప్పకుండా ఏర్పాటు చేస్తామని దీంతోపాటు నూతన కలెక్టరేట్ భవనం నిర్మిస్తామన్నారు.



# నిత్య అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం



**అన్నవరం, జూన్ 26, మనం న్యూస్:** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని నిత్య అన్నదాన పథకానికి దాతలు మరోసారి ఉదారత చాటారు. నందివాడ మండలం కుదరవల్లికి చెందిన జి. మహంకాళి రావు, జయలక్ష్మి దంపతులు రూ.1,00,000 విరాళాన్ని శుక్రవారం నాడు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి సిసి గణపతికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది మే 24న గొర్ల సత్య కృష్ణ తిలక్, రమాదేవి పేర్లపై నిత్య అన్నదానం నిర్వహించాలని దాతలు దేవస్థానం అధికారులను కోరారు. దాతల అభీష్టాన్ని గౌరవిస్తూ, దేవస్థానం నిబంధనల మేరకు అన్నదానం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. దేవస్థానం అధికారులు దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి వారి దాతృత్వాన్ని అభినందించారు. నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందించడం ద్వారా వేలాది మంది భక్తులకు ఉచిత భోజన సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## ఆయిల్ ఫామ్ రైతుల సమావేశానికి తుమ్మలకు ఆహ్వానం



దమ్మపేట, జూన్ 26(మనం న్యూస్): పామాయిల్ రైతులు ఆనందంగా ఉన్నారంటే కారణం మీరే సార్... మా ఆత్మీయ సమావేశానికి మీరు రావాలంటూ మంత్రి తుమ్మలను రైతులు ఆహ్వానించినారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మంత్రి నివాసంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని శుక్రవారం ఉదయం ములకలపల్లి రైతులు మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆనందాన్ని వెలిబుచ్చారు.
పామాయిల్ పంటను విస్తరించడానికి సరిపడా ఫ్యాక్టరీల నిర్మాణానికి కృషి చేస్తున్న మంత్రి తుమ్మలను వారు సన్మానించారు. గత 20 సంవత్సరాల నుండి పామా యిల్ పంటను పండించాలని మీరు పదే పదే చెప్పేవారు. మీ మాట ప్రకారం ఆయిల్ ఫామ్ పంటను వేసాం. ఇప్పుడు ఆనందంగా ఉన్నాం. దానికి మీరే కారణం అని రైతులు మంత్రి తుమ్మల వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ములకలపల్లి మండల ఆత్మీయ సమావేశానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

### గోధుమవాగు బ్రిడ్జిపై వర్షపు నీరు నిల్వ..

## ప్రమాదాలకు ఆహ్వానం

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

### వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



రామవరం, జూన్ 26(మనం న్యూస్): కొత్తగూడెం నుంచి విజయవాడకు వెళ్లే జాతీయ రహదారి (ఎన్హెచ్-30)లో గోధుమవాగు బ్రిడ్జి తీవ్ర దుస్థితికి చేరుకుంది. కొత్తగూడెం నుంచి రామవరం వైపు వెళ్లే ఈ బ్రిడ్జిపై చిన్నపాటి వర్షం కురిసినా భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జిపై అనేక చోట్ల లోతైన గుంతలు ఏర్పడటంతో వాటిలో వర్షపు నీరు నిలిచి ఉండటంతో గుంతల లోతు కనిపించక ప్రమాదాలకు దారితీసే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, అత్యవసర సేవల వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించేంద ుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్లు పలుమార్లు రహదారి దుస్థితిపై సంబంధిత అధికారులకు, పత్రికల ద్వారా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం కురిసిన స్వల్ప వర్షానికే బ్రిడ్జిపై నీరు పూర్తిగా నిలిచిపోవడంతో రాకపోకలు మరింత ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత జాతీయ రహదారి అధికారులు స్పందించి బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడ్చి, వర్షపు నీరు నిల్వ కాకుండా తగిన డ్రైనేజీ ఏర్పాట్లు చేసి రహదారిని వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కొత్తగూడెంలో గంజాయి కలకలం..!

### పలు ప్రాంతాల్లో బహిరంగంగా వినియోగమంటూ స్థానికుల ఆందోళన

**మహిళలు, వృద్ధులు, విద్యార్థుల్లో పెరుగుతున్న భయం**

**ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి**



కొత్తగూడెం టౌన్, జూన్ 26(మనం న్యూస్): వేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్తగూడెం పట్టణంలో మాదకద్రవ్యాల ప్రభావం పెరుగుతోందనే ఆందోళన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇటీవల పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో గంజాయి అక్రమ విక్రయాలు, బహిరంగ వినియోగం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని ఈ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. బూడిదగడ్డ ఎస్ కే డి వెళ్లే దారిలో కూడా కాళీమాత ఆలయం పరిసరాలు, పాత ఓల్ డిపో గ్రౌండ్, భావన బార్ షాప్ ముందు, అశోక్ నగర్ రైల్వే ట్రాక్ సమీపం, బజార్ మందిర్ గుడి వెనుక భాగం వంటి ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు తరచూ గంజాయి సేవిస్తున్నట్లు కనిపిస్తోందని చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం కూడా పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వేళల వరకు కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు కనిపిస్తుండటంతో ఆ ప్రాంతాల గుండా వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు, విద్యార్థులు భయపడుతున్నారని చెబుతున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో కూడా అసౌకర్యం ఎదురవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, ఉదయం, సాయంత్రం వాకింగ్కు వెళ్లే వృద్ధులు ఈ పరిస్థితుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు అంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి కార్యకలాపాలు కొనసాగడం వల్ల చిన్నారులపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా ఈ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలు పెరిగాయని కొన్ని సందర్భాల్లో మత్తులో ఉన్న వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు కూడా స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రశాంతంగా ఉండే కాలనీల్లో భయాందోళన వాతావరణం నెలకొంటోందని చెబుతున్నారు. గంజాయి వినియోగం కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాకుండా దొంగతనాలు, గొడవలు, ఇతర నేరాలకు కూడా దారితీసే అవకాశం ఉందని భావిస్తున్నారు. అందువల్ల పరిస్థితి మరింత విషమించేలోపు సంబంధిత అధికారులు అప్రమత్తమై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని తరచూ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహించాలని అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయాలని గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాసంస్థలు, కాలనీల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కూడా వారు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం నేరాల నియంత్రణలో ఇప్పటికే పలు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు సూచిస్తున్న ఈ ప్రాంతాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల సహకారంతో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపడితే పట్టణంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడుతున్నారు.

## మత్తుకు దూరంగా ఉంటేనే జీవితాల్లో వెలుగులు

### షేర్ చేయూత వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం




మధిర, జూన్ 26(మనం న్యూస్): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా షేర్ చేయూత మత్తు పదార్థాల పునరావాస కేంద్రంలో అవగాహనా సదస్సుఅంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిరలోని షేర్ చేయూత మత్తు పదార్థాల పునరావాస కేంద్రంలో షేర్ సంస్థ డైరెక్టర్ జి.గోపాలరెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధిర మున్సిఫ్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు బానిసలైతే కుటుంబంతో పాటు సమాజం కూడా తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. మత్తు వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలను బాధితుల ద్వారా వివరింపజేసి, బాధితుల పునరావాసానికి షేర్ సంస్థ అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ అదనపు సంచాలకులు, కుటుంబ సంక్షేమ శాఖ డాక్టర్ ఏ.కొండలరావు మాట్లాడుతూ, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులే మొదటి దైవమని, వారిని ప్రతిరోజూ గౌరవించాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి కలిగే భ్రమలు ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తాయని, అలాంటి వ్యసనాలను విడిచిపెట్టి ఆరోగ్యకరమైన జీవితం గడపాలని పిలుపునిచ్చారు. మధిర ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, నిల్వ, విక్రయం, వినియోగం వంటి నేరాలకు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్స్ చట్టం-1985 ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు.మధిర బార్ అసోసియేషన్ సభ్యులు వాసంశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీఓ మాధవరపు నాగేశ్వరరావు, షేర్ సంస్థ సిబ్బంది, ఇంటర్ విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.అనంతరం మత్తు పదార్థాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన భారీ ర్యాలీని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని నినాదాలు చేశారు.

### ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు ఉర్దూలోనూ ప్రచురించాలి

- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా



ఖమ్మం, జూన్ 26(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూ భాషలో కూడా అందుబాటులో ఉంచాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో ఎన్నికల కమిషన్ ను కోరారు. రాష్ట్రంలో తెలుగుతో పాటు ఉర్దూ కూడా అధికారిక ద్వితీయ భాష అయినప్పటికీ, ఎన్నికల కమిషన్ ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూలో ముద్రించకపోవడం లక్షలాది ఉర్దూ మాట్లాడే ఓటర్లకు ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తెలుగులో మాత్రమే ఫారాలను అందిస్తున్నట్లు సమాచారం ఉందని దీంతో ఉర్దూ మాతృభాషగా ఉన్న వృద్ధులు, నిరక్షరాస్యులు మరియు సాధారణ ప్రజలు ఫారాలను సరిగా అర్థం చేసుకుని పూరించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడైన ఓటరుకు తన భాషలో సేవలు అందించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని పేర్కొన్నారు. అందువల్ల ఎన్నికల కమిషన్ వెంటనే ఉర్దూ భాషలో కూడా ఎన్యూమరేషన్ ఫారాలను ముద్రించి పంపిణీ చేయాలని అలాగే ఉర్దూ మాట్లాడే ప్రాంతాల్లో ఉర్దూ తెలిసిన సిబ్బందిని నియమించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని యాకూబ్ పాషా కోరారు. భాషా సమానత్వాన్ని గౌరవిస్తూ ప్రతి ఓటరికి సులభంగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ కు లేఖ రాయనున్నట్లు యాకూబ్ పాషా తెలిపారు.

## మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయాలి

### అవగాహనా ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ దివాకర్ టిఎస్

### ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం : సీపి



ఖమ్మం, జూన్ 26(మనం బ్యూరో): మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూమాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, యువత, అధికారులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్ములనకై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాధకద్రవ్యాల నిర్ములన కై 'ఐయమ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్' సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటో, సైన్ బోర్డు వద్ద సంతకం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## 28, 29 తేదీల్లో జరిగే రైతు మేళాను వినియోగించుకోవాలి

- **150 స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన ప్రదర్శనలు**
- **30న నిర్వహించే రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీగా ఏర్పాట్లు**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత**
- **జగన్నాథపురం వద్ద స్టాల్స్, పార్కింగ్ ఏర్పాట్ల పనులను పరిశీలించిన కలెక్టర్ దివాకర టిఎస్**



ఖమ్మం, జూన్ 26(మనం బ్యూరో): ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం వద్ద ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు మేళా, ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే రైతు మేళాలో 150కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, పాల ఉత్పత్తి, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటి విభిన్న రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు ప్రత్యక్ష అనుభవం కలిగేలా ఆధునిక వ్యవసాయ యంత్రాల ప్రదర్శనలు, అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులపై ప్రత్యేక డెమోలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి రైతుల సందేహాలకు ప్రత్యక్షంగా సమాధానాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు మేళాకు వచ్చే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, భోజన వసతులు, సమాచార కేంద్రాలు, తగిన సంఖ్యలో కౌంటర్లు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు, వృద్ధులకు సౌకర్యాలను ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 30న నిర్వహించే ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక మొహరం




### కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు ఉత్సవ ప్రాంగణాల సందర్శన

### ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

పాల్వంచ, జూన్ 26(మనం న్యూస్):మతసామరస్యానికి ప్రతీకగా మొహరం నిలుస్తోందని కొత్తగూడెం నగరపాలక సంస్థ పాల్వంచ 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు ( జివిఆర్ ) అన్నారు. పాత పాల్వంచ పరిధిలో నిర్వహిస్తున్న పీర్ల ఉత్సవాలను కార్పొరేటర్ గుర్రం శుక్రవారం తిలకించారు. ముస్లిం సోదర, సోదరీమణులకు పీర్ల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పలు పీర్ల దర్గాలు, ఉత్సవ ప్రాంగణాలను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులను కార్పొరేటర్ జీవిఆర్ ఆప్యాయంగా పలకరించారు. మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగ సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ.. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ప్రజలతో మమేకమవుతూ ప్రజాభిప్రాయం మేరకు డివిజన్ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్ల వెంకటరత్నం, శనగ శీను, రూపస్, అల్లి ప్రేమ్ కుమార్, పుట్టి వెంకటేశ్వర్లు, భరద్వాజ్, వల్లమల్ల సందీప్, కళ్యాణ్, కాల్వ నాగేష్, రాజేష్, సందీప్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.మతాలు వేరైనా మనమంతా ఒక్కటే... సామరస్యమే సమాజ ప్రగతికి పునాదని కార్పొరేటర్ గుర్రం నొక్కి వక్కాణించారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



దమ్మపేట, జూన్ 26(మనం న్యూస్ ): దమ్మపేట మండల కేంద్రంలో గల ప్రధాన రహదారి డివైడర్ పై తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించడం పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా పర్యావరణ యజ్ఞాన్ని స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ, మొక్కలు నాటి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, రాంబాబు, దమ్మపేట ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, ఎ.ఎం.సి చైర్మన్ వాసం రాణి, శ్రీను, సి.ఐ నాగరాజు, ఎస్.ఐ రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, కే.వి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాక రమేష్, దిశ కమిటీ సభ్యులు సొంగా ఏసుమణి, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, చాట్ల శ్రీనివాసరావు, బద్దె వెంకటలీల రాంబాబు, పూనెం పోలమ్మ, షేక్ గోరె, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి, ముక్తేశ్వరరావు, గ్రామస్తులు అత్తులూరి వెంకట రామారావు, దాసరోజు రామబ్రహ్మం, పగడాల కృష్ణారావు, వనమాల శ్రీనివాసరావు వసంత, శంకవర అయ్యప్ప, రొయ్యల కుమార్, కొయ్యల ప్రసాద్, చిలకా శ్రీను, ఉల్వాల రాంబాబు, అన్నవరపు నాగేంద్రరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'సిందూర్'లో అమరులను ప్రకటించిన కేంద్రం



**ఢిల్లీ, జూన్ 26 :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా గతేడాది పాకిస్థాన్‌పై జరిపిన 'ఆపరేషన్ సిందూర్'లో మన దేశం కొంతమంది వీరజవాన్‌లను కోల్పోయింది. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన ఆ అమరవీరుల పేర్లను కేంద్రం ఇప్పుడు అధికారికంగా ప్రకటించింది. వారి పేర్లను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఈ ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల పేర్లను కేంద్రం వెల్లడించడం ఇదే తొలిసారి.

'ఆపరేషన్ సిందూర్'లో ఐదుగురు ఆర్మీ అధికారులతో పాటు ఓ అగ్నివీర్ దేశం కోసం పోరాడుతూ వీరమరణం పొందారు. వీరి పేర్లను దేశ రాజధాని దిల్లీలోని ఇండియా గేట్ సర్కిల్లో ఉన్న జాతీయ యుద్ధ స్మారకం వద్ద ప్రత్యేక శిలాఫలకంపై శాశ్వతంగా చెక్కనున్నారు. ఆ అమరుల వివరాలు ఇలా..

సుబేదార్ మేజర్ పవన్ కుమార్ - 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్, రైఫిల్‌మాన్ సునీల్ కుమార్ - జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ - 5 ఫీల్ రెజిమెంట్, హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ - 237 ఫీల్డ్ వర్క్‌షాప్, సార్జెంట్ సురేంద్ర కుమార్ - ఎయిర్‌పోర్స్ 39వ వింగ్, అగ్నివీర్ మురళీ నాయక్ - 851 లైట్ రెజిమెంట్ వీరిలో రైఫిల్‌మాన్ సునీల్ కుమార్‌ను కేంద్రం మరణానంతరం మూడో అత్యున్నత యుద్ధ పురస్కారమైన 'వీర చక్ర'తో సత్కరించింది. ఇక, సార్జెంట్ సురేంద్ర కుమార్ను 'వాయు మెడల్'తో గౌరవించింది. ఇక, వీరిలో మురళీ నాయక్ తెలుగు వ్యక్తి అన్న సంగతి తెలిసిందే. శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాకు చెందిన మురళీ 2022లో అగ్నివీర్‌గా ఎంపికై తొలుత పంజాబ్, అస్సాంల్లో పనిచేశారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ పాకిస్థాన్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. 2025 ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా మే 7వ తేదీన పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత్ విరుచుకుపడింది.

# ఏమాత్రం ఉపేక్షించబోం: సీఎం యోగి

## రామ మందిర నిధుల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం



**లఖ్‌నవూ, జూన్ 26:** రామ మందిర విరాళాల నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. ఈ కేసులో తన డ్రైవర్ అరెస్టయిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్టు పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు ట్రస్టుకు చెందిన మరో సభ్యుడు అనిల్ మిశ్రా కూడా తన బాధ్యతల నుంచి వైదొలిగారు.

అయోధ్య రామాలయానికి అందిన విరాళాలపై వచ్చిన ఆరోపణల మీద తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసు కేసు నమోదైంది. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారిలో ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్రాయ్ డ్రైవర్ కూడా ఉన్నాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రెండు రోజుల క్రితం తమ ప్రాథమిక నివేదికను యూపీ సర్కారుకు సమర్పించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగంపై సిట్ దర్యాప్తు ముమ్మరం చేసిందని, ఆరోపణలు ఎదుర్కొంటున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ వెల్లడించారు. ఈ ఉదంతంలో పాలు పంచుకున్న ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. 'అయోధ్య మందిరంలో జరిగిన ఘటనపై ఎవరూ చింతించకండి. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిని విడిచిపెట్టబోం. ఇది భక్తుల మనోభావాలకు, విశ్వాసానికి సంబంధించిన విషయం' అని యోగి ఆదిత్యానాథ్ అన్నారు. గతంలో రామమందిరానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారే.. నిధుల దుర్వినియోగంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై మండిపడ్డారు.

# ఇరాన్‌తో ఆహార కొరత.. ఆ సొమ్మును నేరుగా ఇవ్వం

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

### ఒప్పందంలో ఆ విషయం లేదు

### ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్



**వాషింగ్టన్, జూన్ 26:** ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం విదేశాల్లోని ఆ దేశ ఆస్తులను విడిపించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. అయితే ఈ నగదు టెహ్రాన్‌కు నేరుగా చేరదని.. ఆ నిధులను ఇరాన్‌లోని ఆకలి సమస్యను తగ్గించడానికి అమెరికా రైతుల నుంచి మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఇరాన్ ఆస్తులను విడుదల చేస్తే.. అవి తమ దేశంలోని రైతులను ధనవంతులుగా చేయడానికి.. ఆహార కొరతతో ఇబ్బంది పడుతున్న ఇరాన్ ప్రజలకు ఆహారం అందించడానికి ఉపయోగపడతాయన్నారు.

**ఒప్పందంలో ఆ విషయం లేదు: ఇరాన్**

ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాన్ మండిపడింది. ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ స్పందిస్తూ.. తమ ఆస్తులతో ఆహార ధాన్యాలను కొనుగోలు చేస్తామని అమెరికా తప్పుగా వాదిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమెరికా వస్తువుల కొనుగోలును తప్పనిసరి చేసే ఎలాంటి చట్టపరమైన నిబంధనలు అవగాహనా పత్రంలో లేవని అన్నారు. విదేశాల్లోని తమ ఆస్తులను విడిపించి ఇవ్వాలని ఒప్పందంలో భాగంగా అగ్రరాజ్యానికి ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ట్రంప్ ఇలాంటి ప్రకటన చేయడం అమెరికా ఓటమికి నిదర్శనమన్నారు.

# వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లిస్తున్న బ్రిటిష్ రాజు



**లండన్, జూన్ 26:** లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాల వల్ల బ్రిటిష్ రాజు తమ్ముడు ప్రిన్స్ ఆండ్రూ అపఖ్యాతి పాలైన దరిమిలా, రాజకుటుంబ ఆర్థిక వ్యవహారాల్లో మరింత పారదర్శకత కోసం డిమాండ్లు పెరిగాయి. అందువల్ల రాజు తన వ్యక్తిగత ఆదాయ పన్నుచెల్లింపు వివరాలను వెల్లడిస్తున్నట్లు గురువారం సాధికార ప్రకటన వెలువడింది. ఎప్‌స్టీన్ వ్యవహారంతో ఆండ్రూ 2025లో యువరాజు హోదా కోల్పోయి, మౌంట్‌బాటన్-విండ్సర్ పేరుతో వ్యవహరించాల్సి వస్తోంది. పెద్ద రాజభవనాన్ని ఖాళీ చేయవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో రాజు చార్లెస్ తన పన్ను వివరాలను వెల్లడించదలిచారు. చరిత్రలో ఈ విధంగా చేస్తున్న మొట్టమొదటి బ్రిటిష్ రాజు ఆయనే అవుతారు. ప్రజల పన్నుల ద్వారా రాజకుటుంబానికి నిధులు సమకూర్చే విధానమైన 'సావరిన్ గ్రాంట్'పై బకింగ్‌హామ్ ప్యాలెస్ వార్షిక సమావేశంలో రాజు పన్నుల సమాచారాన్ని విడుదల చేయనున్నారు. చార్లెస్ గద్దెనెక్కడానికి ముందు ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌గా ఉన్నప్పుడు తన వ్యక్తిగత ఆదాయ పన్ను వివరాలను విడుదల చేసినప్పటికీ, 2022లో ఆయన తల్లి రెండవ ఎలిజబెత్ రాణి మరణం తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించాక ఇలా చేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుత ప్రిన్స్ ఆఫ్ వేల్స్ అయిన ప్రిన్స్ విలియం కూడా తన తండ్రి చార్లెస్ బాటలోనే పయనిస్తారని భావిస్తున్నారు. రాజుకు మినహాయింపు ఉన్నప్పటికీ, చార్లెస్ తన ప్రైవేటు ఆదాయంపై స్వచ్ఛందంగా పన్ను చెల్లిస్తున్నారు.

# పీసీఎఫ్ సాంకేతికతపై మద్రాస్ ఐఐటీలో పరిశోధన కేంద్రం



**చెన్నై, జూన్ 26:** దేశంలోనే తొలిసారిగా ప్లాంట్ సెల్ ఫెర్మెంటేషన్(పీసీఎఫ్) టెక్నాలజీపై పరిశోధనల కోసం సరికొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ఐఐటీ మద్రాస్(ఐఐటీఎం), హెర్బాలైఫ్ ఇంటర్నేషనల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త సహకారంతో ఈ నెల 22న ప్రారంభమైంది.

ఈ సాంకేతికత ద్వారా మొక్కల కణాలను ప్రయోగశాలల్లో పెంచి క్యాన్సర్ వంటి వ్యాధులకు ఔషధాలు తయారు చేస్తారు. సౌందర్య సాధనాలు, ఆరోగ్యానికి మేలుచేసే ఫైటోకెమికల్స్, సుగంధ ద్రవ్యాలు, సువాసనలు వెదజల్లే పదార్థాలను ఉత్పత్తి చేయనున్నారు. అడవులను నరకకుండా, నియంత్రిత పరిస్థితుల్లో కణాలను పెంచడం వల్ల పర్యావరణానికీ మేలు జరుగుతుంది.

భావితరాల ఆరోగ్యం, శ్రేయస్సు నిమిత్తం మొక్కల నుంచి ఉత్పత్తులను అభివృద్ధి పరచడానికి ఈ కేంద్రం దోహదపడుతుందని ఐఐటీఎం డీన్ (అలుమ్ని, కార్పొరేట్ రిలేషన్స్) ప్రొఫెసర్ అశ్విన్ మహాలింగం తెలిపారు. 'హెర్బాలైఫ్' ఎండీ అజయ్ ఖన్నా, ఉపాధ్యక్షుడు(స్ట్రాటజీ) ఉదయ ప్రకాశ్, హిమాలయ వెల్‌నెస్ కంపెనీ ఆర్అండ్డీ డైరెక్టర్ డాక్టర్ యూవీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కనిష్కను కూల్చింది ఖలిస్థానీ ఉగ్రవాదులే

### 41 ఏళ్ల తర్వాత తొలిసారి అధికారికంగా అంగీకరించిన కెనడా



**ఒట్టావా, జూన్ 26:** ఖలిస్థానీ ఉగ్రవాదంపై మెతక వైఖరి అవలంబిస్తూ.. వారికి పరోక్షంగా మద్దతిస్తూ, ఆశ్రయమిస్తూ వచ్చిన కెనడా తన వైఖరిని మార్చుకుంటోందా..? అవుననే సమాధానం వస్తోంది. ఎయిరిండియా కనిష్క విమాన ప్రమాదం జరిగి నాలుగు దశాబ్దాల గడిచిన తర్వాత తొలిసారి.. 329 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఘటనలో ఖలిస్థానీ ఉగ్రవాదుల పాత్ర ఉందని అధికారికంగా అంగీకరించింది. ఇన్నాళ్లు ఖలిస్థానీ వేర్పాటు వాదుల పేరును ఎన్నడూ ప్రస్తావించని ఆ దేశం ఇప్పుడు ఆ దారుణ మారణ కాండకు వారే కారణమని స్పష్టం చేసింది. 1985 జూన్ 23న అట్లాంటిక్ మహా సముద్రంపై ఎయిరిండియా బోయింగ్ విమానం 'కనిష్క' కూలి అందులో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. టొరంటో నుంచి ముంబయికు బయల్దేరిన ఆ విమానంలో ఉగ్రవాదులు బాంబు పెట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇది ఖలిస్థానీ ఉగ్రవాదుల పనేనని భారత్ స్పష్టంగా పేర్కొంది. కానీ కెనడా ఎన్నడూ వారి పాత్రను అంగీకరించడానికి ఇష్టపడలేదు. విచారణ తూతూ మంత్రంగా జరిపింది. దీంతో కీలక నిందితులు తప్పించుకున్నారు. ఈ నేపథ్యంలో కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ (సీఎస్ఐఎస్) బుధవారం ఫేస్‌బుక్ పోస్ట్‌లో దాడికి ఖలిస్థానీ వేర్పాటువాద ఉద్యమమే కారణమని స్పష్టం చేసింది. కెనడా స్థావరంగా పనిచేస్తున్న ఖలీస్థానీ తీవ్రవాదులే.. బాంబు పెట్టి విమానంలో ఉన్న వారినందరినీ హతమార్చారని తెలిపింది. కెనడా చరిత్రలోనే అత్యంత దారుణమైన ఉగ్ర దాడి అని పేర్కొంది. విమానంలోని లగేజీ విభాగంలో ఖలీస్థానీ గ్రూప్ బబ్బర్ ఖాల్సా సభ్యులు నాడు బాంబులు పెట్టి విమానాన్ని కూల్చేశారు.

# లోతు తక్కువ.. ముప్పు ఎక్కువ!

- వెనెజువెలాలో అసాధారణ జంట భూకంపాలు
- వెనెజువెలాకు ఎందుకీ ముప్పు ?



**కారకస్, జూన్ 26:** జీవకోటి తలదాచుకోవడానికి ఆశ్రయమిస్తున్న భూమి ఉన్నట్టుండి ఊగిపోతూ.. అపార ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగిస్తోంది. ఈ భూకంపాలు నిత్యం ఎక్కడోచోట స్వల్పస్థాయిలో వస్తున్న ప్పటికీ కొన్ని మాత్రం తీవ్రంగా వణికిస్తున్నాయి. పులిమీద పుట్రలా దాదాపు ఏకకాలంలో వచ్చిన జంట భూకంపాలతో వెనెజువెలా కంపించిపోయింది. అవి తక్కువ లోతులోనే రావడం పెను విధ్వంసాన్ని మిగిల్చింది.

**వెనెజువెలాకు ఎందుకీ ముప్పు ?**

భూమి పైపొర మొత్తం ఒకే ఆకృతిలా ఉండదు. అది 15 ఫలకాలుగా విడిపోయి ఉంటుంది. వీటిని టెక్టానిక్ ప్లేట్స్ అంటారు. ఇవి తీవ్ర వేడితో కూడిన శిలాద్రవంపై తేలియాడుతూ ఉంటాయి. అందువల్ల ఈ ఫలకాలు నిరంతరం కదులుతూ ఉంటాయి. ఈ కదలికలు నెమ్మదిగానే ఉంటాయి. కానీ చాలా శక్తిమంతంగా సాగుతాయి. వెనెజువెలాలోని చాలాభాగం సురక్షితమైన దక్షిణ అమెరికా ఫలకంపై ఉంది. ఉత్తర తీర ప్రాంతం, కరీబియన్ దీవులు మాత్రం అత్యంత క్రియాశీలంగా ఉండే ఫలకాల సరిహద్దుపై ఉన్నాయి. అక్కడ కరీబియన్, దక్షిణ అమెరికా ఫలకాలు కలుసుకుంటాయి. ఈ రెండింటి మధ్య రాపిడి జరుగుతుంటుంది. దీనికితోడు ఆ ప్రాంతంలో అనేక పగుళ్ల వ్యవస్థలు ఉన్నాయి. అవి విడిగా కాకుండా పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. దక్షిణ అమెరికా ఫలకంతో పోలిస్తే కరీబియన్ ఫలకం.. ఏటా రెండు సెంటీమీటర్ల మేర తూర్పు వైపునకు జరుగుతోంది. దీనివల్ల అక్కడి పగుళ్లలో ఒత్తిడి పేరుకుపోతోంది. ఇలా నిల్వ ఉన్న ఒత్తిడి అకస్మాత్తుగా విడుదలైనప్పుడు శక్తిమంతమైన భూకంపం ఏర్పడుతోంది. వెనెజువెలాలోని 80 శాతం జనాభా.. ఈ ఫలకాల క్రియాశీలత ఎక్కువగా ఉన్న ప్రదేశంలోనే నివసిస్తోంది. కొన్ని సెకన్లు లేదా నిమిషాల వ్యవధిలో దాదాపుగా ఒకే తీవ్రతతో, ఒకే పగులు లేదా పరస్పరం సంధానమైన రెండు పగుళ్లను ఛిద్రం చేస్తూ రెండు భారీ ప్రకంపనలు వస్తే వాటిని భూకంప ద్వయం అంటారు. సాధారణంగా ఒక భూకంపం ఏర్పడినప్పుడు.. తొలుత ప్రధాన ప్రకంపన ఉత్పన్నమవుతుంది. ఆ తర్వాత చిన్నపాటి ప్రకంపనలు (ఆఫ్టర్ షాక్స్) తలెత్తుతుంటాయి. భూకంప ద్వయంలో మాత్రం రెండు ప్రధాన ప్రకంపనలు దాదాపుగా సమానస్థాయిలోనే ఉంటాయి. వెనెజువెలాలో తాజాగా నిమిషం వ్యవధిలోపే 7.2, 7.5 తీవ్రతతో రెండు భూకంపాలు వచ్చాయి. ఇలాంటివి అసాధారణం. ఎందుకంటే ఒక పగులు ఛిద్రమైతే.. భూఫలకాల్లో పేరుకుపోయిన ఒత్తిడి చాలావరకూ బయటకు వచ్చేస్తుంది. మరో శక్తిమంతమైన ప్రకంపనకు ఆస్కారం ఉండదు. ఒక ఫాల్ట్ జోన్ వద్ద భూకంపం వచ్చిన సమయంలోనే సమీపంలోని పగులు వ్యవస్థ వద్ద కూడా ఒత్తిడి పేరుకుపోయిన పరిస్థితి ఉంటే జోడు ప్రకంపనలు తలెత్తుతుంటాయి.వెనెజువెలాలో ప్రకంపనలు ఇంత విధ్వంసకరంగా ఉండటానికి ప్రధాన కారణం.. అవి భూ ఉపరితలం నుంచి తక్కువ లోతులో ఏర్పడటమే. నేల నుంచి కేవలం 15-20 కిలోమీటర్ల లోతులోనే అవి ఉత్పన్నమయ్యాయి. ఎక్కువ లోతులో ఏర్పడే ప్రకంపనలతో పోలిస్తే ఇవి ప్రమాదకరమైనవి. నేలకు దగ్గరలోనే ఏర్పడటం వల్ల.. జనవాసాలను తాకడానికి ముందు కొంతమేర బలహీనపడటానికి కావాల్సినంత దూరం కానీ సమయం కానీ వాటికి ఉండదు.

# భారతీయులమని చెప్పుకొనేందుకు ఆధారమేంటి?

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ శిథరూర్

**ఢిల్లీ, జూన్ 26:** విదేశీ ప్రయాణ అనుమతి పత్రమేనంటూ కేంద్రం స్పష్టం చేయడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. పాస్‌పోర్ట్, ఆధార్లను ప్రభుత్వం ఉపసంహరించుకొనేంత వరకు వాటిని పౌరసత్వాన్ని తెలిపే ఆధారాలుగా పరిగణించాలన్నారు. అందుకు వీలుగా చట్ట సవరణలు చేయాలని కోరారు.



అంతేకాకుండా ఆధార్ జారీ ప్రక్రియలోనూ కొన్ని మార్పులు చేస్తే బాగుంటుందని ఆయన కేంద్రానికి సూచించారు. ''ప్రస్తుతం పౌరసత్వం ఆధారంగా ఆధార్ కార్డులను జారీ చేయడం లేదని ప్రభుత్వమే చెబుతోంది. కనీసం 182 రోజులు ఓ ప్రాంతంలో ఉంటే.. వారు అధార్ పొందేందుకు అర్హులుగా పేర్కొంటోంది. భారతీయ పౌరసత్వం లేకపోయినా ఆధార్ ఇస్తున్నారు. ఈ సమస్యకు ఓ పరిష్కార మార్గాన్ని కూడా ఉంది. చూడగానే ఫలానా వ్యక్తి భారతీయ పౌరుడు కాదని గుర్తించేలా.. ఆధార్ కార్డుపై భాగంలో అడ్డంగా ఎర్రని స్ట్రిప్ ఉండేలా ప్రత్యేక కార్డులను జారీ చేయాలి'' అని శశిథరూర్ సూచించారు. ''1967 నాటి పాస్‌పోర్టు చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. భారతీయ పౌరులు కానివారికీ పాస్‌పోర్టులు ఇస్తామని కేంద్రం చెబుతోంది. సాంకేతికంగా ఇది వాస్తవమే కావొచ్చు. కానీ, స్థానికులు, స్థానికేతరులకు తేడా ఏముంది. గత కొన్ని దశాబ్దాలుగా పాస్‌పోర్టును తిరుగులేని గుర్తింపు కార్డుగా పరిగణిస్తున్నాం.

పోలీస్ వెరిఫికేషన్, పుట్టినప్పటి నుంచి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పాస్‌పోర్టు జారీ చేస్తారు. ఇదంతా చేసిన తర్వాత కూడా ఇది పౌరసత్వాన్ని నిర్ధరించేందుకు పనికిరాదని కేంద్రం చెప్పడంలో అర్థం లేదు. పాస్‌పోర్టు పౌరసత్వ గుర్తింపు కాకపోతే.. భారతీయ పౌరులమని చెప్పుకొనేందుకు ఆధారం ఏంటి?'' అని శశిథరూర్ ప్రశ్నించారు. ఆధార్ కార్డు కేవలం గుర్తింపు కార్డు మాత్రమేని గతంలో సుప్రీంకోర్టు చెప్పడంతోనే చాలా మంది ప్రజలు గందరగోళానికి గురయ్యారని, తాజాగా పాస్‌పోర్టు విషయంలోనూ కేంద్రం అలాంటి ప్రకటన చేయడంతో అది మరింత పెరిగిందని శశిథరూర్ వ్యాఖ్యానించారు.

## ఒకే రోజులో 766 సమావేశాలు..

# గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



**రాయ్‌పూర్, జూన్ 26:** ఛత్తీస్‌గఢ్‌లోని జష్పూర్ జిల్లా పోలీసులు అరుదైన రికార్డు నెలకొల్పారు. ఒకే రోజు 766 గ్రామాల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు. రోడ్డు ప్రమాదాల్లో నష్టాన్ని నివారించేందుకు హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహించేలా పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్స్ ప్రతినిధి సోనాల్ రాజేశ్ శర్మ ఎస్పీ లాల్ ఉమేద్ సింగ్, పోలీసు ఉన్నతాధికారులకు వరల్ రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రం, మెడల్ అందజేశారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని 766 గ్రామాల్లో సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వివరించారు. దాదాపు 5000 మంది వాలంటీర్లు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు.

రహదారి భద్రత గురించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే ఈ క్యాంపెయిన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజల్లో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగం గురించి అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 18న దాదాపు 10 వేల మందితో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి విశేష స్పందన వచ్చింది. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ సహా పలువురు ప్రముఖులు వీడియో సందేశాలు పంపారు. ఆ స్ఫూర్తితోనే జిల్లా పోలీసు యంత్రాంగం ఈ అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

# లీడర్ ఆఫ్ పర్యాటన్'గా రాహుల్ పేరు మార్చుకోవాలి




### బీజేపీ నాయకుల డిమాండ్

### రాహుల్ గ్లోబల్ లీడర్

### కాంగ్రెస్ కౌంటర్

**ఢిల్లీ , జూన్ 26 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై భారతీయ జనతా పార్టీ మరోసారి విమర్శలు గుప్పించింది. లోక్సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయన తన హోదాను 'లీడర్ ఆఫ్ పర్యాటన్'గా మార్చుకోవాలని ఎద్దేవా చేసింది. ప్రముఖ బాలీవుడ్ చిత్రాలను అనుకరిస్తూ రాహుల్ ఫొటోలతో రూపొందించిన పోస్టర్లను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. 'చక్దే ఇండియా' అనే పేరు ధ్వనించేలా 'చాడ్ దే ఇండియా' (భారత్ వీడి వెళ్లిపోవాలి)..భారత్‌లో రాహుల్ కనిపించడం లేదు అని అర్థం వచ్చేలా 'లాపతా రాహుల్' అంటూ రాష్ట్ర బీజేపీ విభాగాలు వ్యంగ్య పోస్టులను షేర్ చేశాయి. 'రాహుల్ బాబాకు స్వదేశం కంటే విదేశాలే ఇష్టం' అంటూ బీజేపీ ఢిల్లీ యూనిట్ పోస్ట్ చేయగా.. 'రాహుల్ ఎక్కడున్నావ్.. థాయ్‌లాండ్‌లో ఎంజాయ్ చేస్తున్నావా..?' అంటూ గోవా విభాగం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టింది. 'నాకున్న సమాచారం ప్రకారం రాహుల్ గాంధీ 55 విదేశీ పర్యటనలు చేశారు. దాదాపు రూ.60 కోట్లు ఖర్చు చేశారు. ఆయనకు ఇంత డబ్బు ఎక్కడ నుంచి వస్తోంది.

ఇంత ఆదాయం ఉందని ఆయన ఎక్కడా చెప్పలేదు. ఆదాయ పన్ను కూడా కట్టడం లేదు. మరి ఆ సొమ్ము ఎక్కడిది?' అంటూ బీజేపీ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ లీడర్ ఆఫ్ పర్యాటన్‌గా తన పేరు మార్చుకోవాలని మరో అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు.

**రాహుల్ గ్లోబల్ లీడర్.. కాంగ్రెస్ కౌంటర్**

బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ పార్టీ కూడా దీటుగా బదులిచ్చింది. రాహుల్ గాంధీని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు కలవాలని కోరుకుంటున్నారని, పలు దేశాలు ఆయన్ను ఆహ్వానిస్తున్నాయని ఆ పార్టీ పేర్కొంది. అయినప్పటికీ వారిలో కొద్దిమందికే రాహుల్ సమయం కేటాయిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ తెలిపారు. రాహుల్ గాంధీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడని కాంగ్రెస్ ఎంపీ మనోజ్ కుమార్ అన్నారు. మోడీ విదేశీ పర్యటనలు చేసినప్పుడు లేనిది రాహుల్ చేస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

## యువత మాదకద్రవ్యాల నుండి దూరంగా ఉండాలి




- ఎస్పీ ఆకాంక్ష యాదవ్

**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 26 (మనం ప్రతినిధి ):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భువనగిరి పోలీసుల ఆధ్వర్యంలో 2కే అవగాహన ర్యాలీ నిర్వహణ శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం మరియు మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా భువనగిరి పోలీసుల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో 2కే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్ నుండి ప్రారంభమై వినాయక చౌరస్తా వరకు కొనసాగింది. విద్యార్థులు, ప్రజలు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ రవీందర్, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, సీఐలు చంద్రబాబు, రమేష్, ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐలు అనిల్ కుమార్, నరేష్, ఇతర పోలీసు అధికారులు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో 'మత్తు పదార్థాల రహిత యాదాద్రి భువనగిరి జిల్లా నిర్మాణం' కోసం అందరూ ప్రతిజ్ఞ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

### సభకు హాజరయ్యే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలి

### రోడ్లు భావనాలు, రవాణా శాఖ స్పెషల్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వికాస్ రాజ్



**నల్లగొండ-- జూన్ 26 ( మనం ప్రతినిధి)ః** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదివారం నాటి నల్గొండ జిల్లా పర్యటన ఆసాంతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా సాగేలా ఏర్పాట్లు ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం లోని ఎన్ జి కళాశాల మైదానంతో పాటు, కనగల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న 13006 కోట్ల రూపాయల హ్యాం రోడ్ల శంకుస్థాపన పైలాన్ ను పరిశీలించారు. ముందుగా ఎన్జీ కళాశాల మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగించే సభా వేదిక, అలాగే సభకు హాజరయ్యే ప్రజల కోసం చేసిన ఏర్పాట్లు, టెంట్లు, జర్మన్ హాంగర్స్, లైటింగ్, సౌండ్, ఎల్ఈడి ,బ్యారికేడింగ్, ఇలా ఒక్కో అంశాన్ని సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లు అన్ని పకడ్బందీగా ఉండాలని, ఎక్కడ లోటు జరగకుండా చూసుకోవాలని ,ముఖ్యమంత్రి నల్గొండ జిల్లాలో అడుగుపెట్టినప్పటి నుండి తిరిగి వెళ్ళిపోయే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యటన మొత్తం సవ్యంగా సాగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కాగా ఎన్జీ కళాశాల మైదానంలో ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగించే బహిరంగ వేదిక ,దానికి ఎదురుగా ప్రజలు ఆసీనులయ్యేందుకు కుర్చీలు, వర్షం వచ్చినా తట్టుకునే లా జర్మన్ హాంగర్స్ తో టెంట్లు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అదేవిధంగా వేదిక ఎడమవైపున వైపున కూడా టెంట్లు వేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్జీ కళాశాల మైదానం చేరుకున్న వెంటనే రెండువైపులా ఉండే ప్రజలకు అభివాదం చేసే విధంగా గ్రౌండ్లో ఇదివరకే ఉన్న కాంక్రీట్ వేదికను కూడా సిద్ధం చేయాలని, అక్కడినుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదం చేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకుగాను ముఖ్యమంత్రి ర్యాంప్ లేదా వాహనం ద్వారా అక్కడికి వచ్చేలా ఏర్పాటు చేయాలని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు కల్పించాలని ఆయన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్ లను ఆదేశించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వివరాలు కూడా ఎస్పీ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ , ఎస్పీ, జిల్లా అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి కనగల్ మార్కెట్ యార్డు సమీపంలో ఆవిష్కరించనున్న హ్యాంరోడ్ల పైలాన్ ను పరిశీలించారు. పైలాన్ కు వినియోగించే రంగులు, సుందరీకరణ పనులు అన్నింటి గురించి ఆర్ అండ్ బి అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. పక్కనే ఉన్న హెలిప్యాడ్ ను కూడా ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి,హ్యాం రోడ్ల సీఈ వి. వెంకటేశ్వర రావు, రోడ్లు భవనాల సిఈ రాజేశ్వర్ రెడ్డి ,ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీరు గణేష్ ,డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ వాణి, సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

# విద్యాసంస్థలను ఇబ్బందులకు గురి చేయొద్దు

- విద్యాసంస్థల్లో సమస్యలు ఉంటే అధికారులకు పిర్యాదులు చేయాలి
- సమస్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు
- విద్యార్థుల రవాణా బస్సులు అడ్డగించడం చందాల రూపంలో డబ్బు వసూళ్లకు పాల్పడడం చట్ట విరుద్ధం



**సూర్యాపేట, జూన్ 26 (మనం ప్రతినిధి):** ప్రవేట్ విద్యాసంస్థల ను సంఘాల పేరుతో ఇబ్బందులు, బెదిరింపులకు గురి చేస్తున్నారు అని వివిధ సమస్యలపై ప్రవేట్ విద్యాసంస్థల నుండి పిర్యాదు వస్తున్నాయి, గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల త్రివేణి పాఠశాల లోకి కొంత మంది వ్యక్తులు విద్యార్థి సంఘాల పేరుతో అక్రమంగా చొరబడి కార్యాలయం తాళాలు పగలగొట్టి, పెద్దగా నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన విషయమై యాజమాన్యం పిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు చట్టపరకారం క్రిమినల్ కేసు నమోదు చేశాం అని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దు, విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయవద్దు అని ఈ సందర్భంగా వివిధ రకాల సంఘాలకు డీఎస్పీ సూచించారు. పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, విద్యార్థులను రవాణా చేసే బస్సులను అడ్డుకోవడం, యాజమాన్యాలను లేదా ఉపాధ్యాయులను బెదిరించడం, పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులు భయపడేలా వాతావరణం సృష్టించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లు చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్ట విరుద్ధం అని హెచ్చరించారు. ప్రవేటు విద్యాసంస్థల్లో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు, విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేయాలి, సమస్యలపై అధికారులు నిబంధనల ప్రకారం విచారణ, దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతే కానీ, విద్యార్థి సంఘాల పేరు చెప్పుకుని పాఠశాలల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవద్దని, విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ వారికి అసౌకర్యం కలిగించకూడదని సూచించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే విద్యాశాఖ అధికారులకు లేదా ఉన్నతాధికారులకు మాత్రమే నివేదించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విద్యాసంస్థల నిర్వహణకు ఆటంకం కలిగిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ స్పష్టం చేశారు. కేసులు నమోదు చేయడం, బైండోవర్ చేయడం లాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# సింగన్నగూడెం టుబిహెచ్‌కె పెండింగ్ పనులను పూర్తి చేయాలి



**యాదాద్రి భువనగిరి,జూన్ 26 (మనం ప్రతినిధి):** సింగన్నగూడెం టు బి హెచ్ కె కాలనీలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం 2 బి హెచ్ కె కాలనీని అదనపు కలెక్టర్ సందర్శించి, కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కాలనీలో నిర్మాణ పనుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాలనీలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ అలివేలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్ళాలి



**సూర్యాపేట టౌన్, జూన్ 26, మనం న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం(రెడ్ హౌస్)లో జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదితతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కేవలం పార్టీ కోసం మాత్రమే కాదు, సమాజ సేవ కోసం కూడా పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, గ్రామాలు, వార్డులు, పట్టణాల్లో ప్రజల మధ్య ఉండాలన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు ప్రజలతో మరింత మమేకమై ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కార్యాచరణ రూపొందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిబింబం యువజన కాంగ్రెస్ అని సర్ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు బూత్ ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ఏ నియోజకవర్గంలో లేని విధంగా సూర్యాపేట నియోజకవర్గంలో బూత్ ఏజెంట్లకు ఐడి కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఒక్క ఓటు కూడా తీసివేయకుండా పటిష్టంగ మన కార్యకర్తలు పనిచేయాలన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరకుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలిమినేటి సురేష్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా నాయకులు అక్కినపల్లి జానయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు గుణగంటి హేమ సతీష్, చిలుముల సునీల్ రెడ్డి, నిమ్మల కీర్తి లవన్, జిల్లా కాంగ్రెస్ సేవదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడు రావుల రాంబాబు, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుకొప్పుల నరేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, వెన్న మధుకర్ రెడ్డి, నాగు నాయక్, పడిదల రవి, జమండ్ల సత్యనారాయణ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, నాగరాజు, రాజబాబు, లేళ్ల సంపత్, మిద్దె జనార్దన్, శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

**యాదాద్రి భువనగిర్నిి, జూన్ 26 (మనం ప్రతినిధి):** కేజీబీవీ భువనగిరి పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ( కేజీబీవీ)ను జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, భోజన నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, ఇతర అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు.పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## హరినామ స్మరణ ఎంతో ముఖ్యమైనది



- చిన్నగుండవెల్లి శ్రీ వేంకటేశ్వరుని 'హరినామ క్షేత్రం నిర్మాణం

**సిద్దిపేట జూన్ 26; మనం ప్రతినిధిః** శ్రీ వేంకకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యౌలో సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామంలోని 7 ఎకరాల విస్తీర్ణములో తిరుమల శ్రీ వేంకటేశ్వరుని 'హరినామ క్షేత్రాన్ని నిర్మిస్తున్నామని టీటీడీ మాజీ ఈవో కేవీ రమణాచారి తెలిపారు. జులై 2వ తేదీన శ్రీశ్రీశ్రీ దేవనాద్ జీయర్ స్వామి పర్యవేక్షణ, మంగళ శాసనములతో తిరుమల శ్రీ వైష్ణవులచే శంకుస్థాపన చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వాహకులు పులగుర్ల సాయి రెడ్డితో కలిసి ఆయన కలిసి మాట్లాడారు. కలియుగములో హరినామ స్మరణ ఎంతో ముఖ్యమైనదన్నారు. ఆయా భక్త బృందాలచే 24 గంటలు నిరంతరాయంగా హరినామ స్మకరణ జరగాలనే శ్రీ వేంకటేశ్వరుని అభిమతానికి అనుగుణంగా మా ప్రయత్నం ఉంటుందన్నారు. ఆసక్తిగల భక్తులు ఈ మహత్కార్యంలో భాగస్వాములై, ఆశీస్సులు అందించాలని కోరారు.

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురి హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

### మృతురాలి అక్క కూతురు, అల్లుడు ప్రధాన సూత్రధారులు

### వ్యక్తిగత కక్షలు, డబ్బు, బంగారు ఆభరణాల కోసమే కుట్ర పన్ని హత్యలు

### నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్




**నల్లగొండ -- జూన్ 26 ( మనంప్రతినిధి ):** నల్లగొండ జిల్లా కేంద్రంలో కలకలం రేపిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు హత్య కేసులో నిధులను పోలీసులు పట్టుకున్నారు ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నల్గొండ పట్టణంలోని తెలంగాణ కాలనీ, సాగర్ రోడ్డులో ఈనెల 22వ తేదీన సాయంత్రం 06:00 గంటల సమయంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు (04) సభ్యులు ఇంట్లోనే చనిపోయి, మృతదేహాలు కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సీనియర్ అధికారుల ఆదేశానుసారం తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో దర్యాప్తు ప్రారంభించారు.ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా హత్య చేసి పారిపోయారా అనే కోణంలో దర్యాప్తు చేయడానికి డి.ఎస్.పి కె. శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్త్రలు, మరియు సీసీఎస్ (సిసిఎస్) సిబ్బందితో కలిపి మొత్తం ఏడు (07) ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు చుట్టుపక్కల వారిని విచారించి, సీసీటీవీ (సీసీటీవీ) ఫుటేజ్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా కీలక సాక్ష్యాలను సేకరించాయి. నమ్మదగిన సమాచారం మేరకు నిందితులను నార్కట్పల్లి ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకుని, పంచుల సమక్షంలో విచారించగా నేరం అంగీకరించారు.

## మొహరం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి జూన్ 26మనం న్యూస్** శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మొహరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో, మత సామరస్యంతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పోలీసు అధికారులతో కలిసి జిల్లా పరిధిలోని పలు గ్రామాలు, పట్టణాలను సందర్శించి మొహరం వేడుకల ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొహరం గుండాలు, ఊరేగింపు మార్గాలు, వేడుకలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ స్థానిక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశమయ్యారు. వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. మొహరం సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో చేరే ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఊరేగింపులు, ఇతర కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకుని పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సోదరభావం, ఐకమత్యంతో మొహరం వేడుకలను విజయవంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు



## చిత్తూరులోపోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డీజీపీ



**చిత్తూరు జూన్26మనం న్యూస్:** జిల్లా పోలీస్ గెస్ట్ హౌస్లోని కాన్ఫరెన్స్ హాల్లో డీజీపీ అదనపు డీజీపీ అనంతపురం రేంజ్ ఐ.జీ డా. శేముషి, తో కలిసి జిల్లా పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, పోలీస్ సంక్షేమం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, జిల్లాలో అమలవుతున్న పరిపాలనా చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ప్రజా సేవల మెరుగుదలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి,, జిల్లా అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న పర్యవేక్షణ, సీసీ కెమెరాల వినియోగం, పటిష్ట నైట్ బీట్ వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై డీజీపీ గారు క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేశారు.

# డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన ర్యాలీ



భీమదేవరపల్లి జూన్ 26 మనం న్యూస్: మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూరులో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించారు. శుక్రవారం రోజున అంతర్జాతీయ మాదగ ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ ఎస్త్రు ఎం రాజు హాజరై ప్రతిజ్ఞ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ డ్రగ్స్ రహితసమాజాన్ని రూపొందించడానికి ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాల భవిష్యత్తు బంగారు బాటగా మార్చడానికి ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనపై పోరాడాలని, యువత చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మాదకద్రవ్యాలు సేవించిన విక్రయాలు చేసిన పోలీసులకు సమాచారం అందించాలని ఎస్త్రు రాజు కోరారు . ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఆదరి రవీందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్ యాదవ్, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిదురాల స్వరూప, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, మహిళా కాంగ్రెస్ నేతలు, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై సమరభేరి

- వరంగల్‌లో 2కే రన్‌కుభారీ స్పందన



వరంగల్, జూన్ 26(మనంన్యూస్): 'సే నో టు డ్రగ్స్ - యెస్ టు లైఫ్' అనే నినాదంతో మాదకద్రవ్యాల నిర్మూలన, యువతలో చైతన్యం కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ నగరంలో భారీ 2కే రన్ నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి లతోపాటు వరంగల్ పోలీస్ కమిషనర్ సంప్రత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ నగర ప్రధాన వీధుల మీదుగా హనుమకొండ ఆరట్స్ కళాశాల మైదానం వరకు కొనసాగింది. 'మాదకద్రవ్యాలు వద్దు - ఆరోగ్యమే ముద్దు', 'డ్రగ్స్ ఫ్రీ వరంగల్' వంటి నినాదాలతో విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయి, ట్రాన్స్కో సీఎండీ వరుణ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి దార కవిత, డిసిపి అంకిత్ కుమార్, పలువురు జిల్లా అధికారులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీ లో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఆరట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగింపు సభలో 2ఓ రన్ విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సంప్రిత్ సింగ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా నాశనం చేస్తాయని అన్నారు. యువత చెడు స్నేహాలు, క్షణిక ఆనందం కోసం డ్రగ్స్కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. నాగరాజు మాట్లాడుతూ, డ్రగ్స్ సమస్య కేవలం పోలీసు శాఖదే కాకుండా సమాజం మొత్తానికి సంబంధించినదని అన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు అందరూ కలిసి యువతను క్రీడలు, యోగా, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఎన్సీసీ క్యాడెట్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓపెన్ కాస్ట్‌లో డ్రైవర్లకు అవగాహన సదస్సు




మల్హార్, జూన్ 26 (మనం న్యూస్): సిరిశెట్టి సంకీర్త ఆదేశాల మేరకు ఈరోజు తాడిచెర్ల లోని ఓపెన్ కాస్ట్ గనిలో పనిచేసే డ్రైవర్లకు కాటారం డిఎస్పి సూర్యనారాయణ, కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది దీనిలో భాగంగా డిఎస్పి మాట్లాడుతూ డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని మద్యం తాగి వాహనాలు నడపద్దు అని గంజాయికి డ్రగ్స్ కి దూరంగా ఉండాలని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని వివరించారు.

# పార్టీకి నమ్మకంగా పనిచేస్తా

- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా
- కార్యక్రమం అందుబాటులో ఉంటా
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి



భీమదేవరపల్లి, జూన్ 26 మనం న్యూస్; మండల కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం రోజున ప్రైవేట్ వేదిక ప్రాంగణంలో నూతనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పోచంపల్లి రాజిరెడ్డిని నియమితుల కావడం వల్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీకి నమ్మకంగా పనిచేస్తానని, ప్రతికార్యకర్తకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు . పార్టీ పటిష్టత సీరియల్ నాయకుల గౌరవిస్తూ వారి సలహాలు స్వీకరిస్తామని అన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండి, నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి పూర్తి సహకారం అందిస్తావని పలువురు నాయకులు, మహిళనేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఆదరి రవీందర్, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఎల్కతుర్తి వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, మండల మహిళకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిదురాల స్వరూప, అధ్యక్షురాలుమేఘన ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్పర్సన్ సుహాసిని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిట్టంపల్లి ఐలయ్య ఊసా కోయిల ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ ఏజ్రా, మాజీ సర్పంచ్ మంగ రామచంద్రం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, మహిళా కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

- నిండు ప్రాణానికి రెండు చుక్కలు
- రేపే పల్స్ పోలియో కార్యక్రమం

మల్హార్, జూన్ 26(మనం న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు 296 బూతులు 14 మొబైల్ టీం లతో వ్యాక్సిన్ పర్యవేక్షణ వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి. 28న దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. చిన్నారులు నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి, పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. 0 నుండి 5 ఏళ్ల వయసు గల చిన్నారులు ఇలాంటి అనారోగ్య సమస్యలతో శతమతమవుతున్న విధిగా రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరి పైన ఉంది, ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ కోరారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ ఇస్తామని జిల్లా నందుగల 241 గ్రామ పంచాయతీలలో అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలలలో ఆదివారం రోజు పోలియో చుక్కలు వేస్తామన్నారు సోమవారం మంగళవారం లలో ఇంటింటికి తిరిగి మిగతా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని మీ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు.

# సొంతింటి కల సహకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



మహాదేవపూర్, జూన్ 26మనం న్యూస్: ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలలను సహకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని బెగ్లూర్ సర్పంచ్ ఆకుల రాజయ్య మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కటకం అశోక్ అన్నారు, శుక్రవారం రోజున గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నీరటిరాజక్క , బుర్రి జయక్క మల్లయ్య నిన్న భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ముగ్గు పోసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు మరియు టి పి సి సి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాలతో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజకార్యక్రమంనిర్వహించడం జరిగిందని అన్నారు, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలలను సహకారం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు

లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులు త్వరగతిన పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సదానందం బుర్రిశివరాజ్, వార్డ్ నెంబర్ గాయ బాపు, గ్రామ కమిటీ మెంబర్లు, లబ్ధిదారులు,ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పీరీల ఊరేగింపు

భీమదేవరపల్లి, జూన్ 26 మనం న్యూస్: మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్ గ్రామంలో ముస్లిం సోదరులు పీరీ లను ఊరేగింపు చేశారు. శుక్రవారం రోజున మొహరం సందర్భంగా ముస్లిం సోదరులు అన్యాయం పై పోరాడిన చరిత్రను గుర్తు చేసుకుంటూ త్యాగానికి నివాళులు ముస్లిం సమాజం యొక్క దుఃఖదినంగా మొహరం జరుపుకుంటారు. మొహరం పదవరోజు అసుర రోజు ఊరేగింపు తర్వాత 11 రోజు ఆ తర్వాత పీరియళ్లను చెరువులో నిమర్జనం చేస్తారు. న్యాయం కోసం ప్రాణం ఇవ్వడానికి సిద్ధం అనే ఇమామ్ హుస్సేన్ సందేశాన్ని ప్రతి ఒక్కరికి చేరవేయడమే పీరీల ఊరేగింపు ఉద్దేశమని ముస్లిం సోదరులు తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో గడపగడపకు వెదురు కర్రలతో చేసిన గుమ్మటం ఆకారపు నమూనా రంగు కాగితాలు పూలు పట్టుబట్టలతో అలంకరిస్తూ పీరీలుగా డప్పు చప్పులతో ఊరేగిస్తారు.



# సర్‌పై అవగాహన కార్యక్రమం



- ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకం
- పోచంపల్లి రాజ్ రెడ్డి

భీమదేవరపల్లి, జూన్ 26 మనం న్యూస్: సర్ పై అవగాహన మండల కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. శుక్రవారం రోజున ప్రైవేట్ వేదిక ప్రాంగణంలో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యవ్యవస్థలో ఓటు కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించడం ఎస్ఐఆర్ లక్ష్యమని అన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రజలు భాగస్వాములు కావాలని చురుకుగా పాల్గొనేటట్టుగా పార్టీ కార్యకర్తలు చూడాలని కోరారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, యువ నేతలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పీరీల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

మహాదేవపూర్ జూన్ 26 మనం న్యూస్: మహాదేవపూర్ మండలంలోని ముస్లిం సోదరులు పీరీలను ఊరేగింపుచేశారుశుక్రవారం రోజున మొహరం సందర్భంగా సర్పంచ్ హసీనా భాను మాట్లాడుతూ ముస్లిం సోదరులు అన్యాయంపైపోరాడినచరిత్రనుగుర్తుచేసుకుంటూ త్యాగానికి నివాళులు ముస్లిం సమాజం యొక్క దుఃఖదినంగా మొహరం జరుపుకుంటారు. మొహరం పదవరోజు అసుర రోజు ఊరేగింపు తర్వాత 11 రోజు ఆ తర్వాత పీరియళ్లనుచెరువులో నిమర్జనం చేస్తారు.న్యాయం కోసం ప్రాణం ఇవ్వడానికి సిద్ధం అనే ఇమామ్ హుస్సేన్ సందేశాన్ని ప్రతి ఒక్కరికి చేరవేయడమే పీరీల ఊరేగింపు ఉద్దేశమని ముస్లిం సోదరులు తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో గడపగడపకు వెదురు కర్రలతో చేసిన గుమ్మటంఆకారపు నమూనా రంగు కాగితాలు పూలు పట్టుబట్టలతో అలంకరిస్తూ పీరీలుగా డప్పు చప్పులతో ఊరేగిస్తారు.



# ములుగు ఎస్పీని కలిసిన ఏటూరునాగారం నూతన సీఐ

- ప్రజా భద్రతకు అంకితభావంతో పనిచేస్తా సీఐ జీడి సూర్యప్రకాశ్



ఏటూర్ నాగారం, జూన్ 26, మనం ప్రతినిధి: నూతనంగా ఏటూరునాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్గా నియమితులైన జీడీ సూర్యప్రకాశ్, ములుగు జిల్లా ఎస్ పి కేకన్ సుధీర్ రామ్నాథ్ ఐ పి ఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జీడీ సూర్యప్రకాశ్ 2012 బ్యాచ్ చెందిన అధికారి. మొదటి పోస్టింగ్ యేడుల్ల బయ్యారంలో చేపట్టగా, అనంతరం వేలేరు, కమలాపూర్, ఇచ్చోడ ( ఆదిలాబాద్) ప్రాంతాల్లో ఎస్ఐగా సేవలందించారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్గా పదోన్నతి పొంది ములుగు జిల్లా ఇంటెలిజెన్స్ సీఐ గా , భూపాలపల్లి స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, వరంగల్ వర్ధన్నపేట సీఐ, గూడూరు (మహబూబాబాద్) సీఐగా విజయవంతంగా విధులు నిర్వహించారు. ఇటీవల గూడూరు నుంచి బదిలీపై ఏటూరునాగారం సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనపై ఉంచిన నమ్మకానికి ఉన్నతాధికారులకు సూర్యప్రకాశ్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.


# తెలంగాణ ఉద్యమకారుల త్యాగానికి చట్టబద్ధమైన గుర్తింపు దక్కాలి

- బీసీ సంఘం నేత విజయగిరి సమ్మయ్య నాయీ

మల్హార్, జూన్ 26(మనం న్యూస్): మలాహర్ రావు మండలం ఎడ్లపల్లిలో విలేకరుల సమావేశంలో జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్చార్జ్ విజయగిరి సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గత ఎన్నో సంవత్సరాలు నుండి ఉద్యమం చేశారు తెలంగాణ ఏర్పాటు సమయంలో 1200 మంది పైగా ప్రాణ త్యాగం చేశారు ప్రజలు పోరాడి ఫలితం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారు తెలంగాణ ఉద్యమంలో అన్ని కుల సంఘాలు ప్రజా సంఘాలు రాజకీయ నాయకులుప్రజలు జర్నలిస్టులు ప్రభుత్వ ఉద్యోగస్తులు సకల జనుల సమ్మె లో అందరు పాల్గొన్నారు నిజమైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వా ఇచ్చిన హామీలు ఉద్యమ కమిటీ నివేదిక ద్వారా నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరగాలి తెలంగాణ ఉద్యమకారులను గుర్తింపు చేపట్టిన ప్రభుత్వానికి ముఖ్యమంత్రి మంత్రివర్గానికి అభినందనలు తెలుపుతూ 28/06/26జరిగే ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి కొడంగల్ వరకు తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ర్యాలీకి అందరు పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.

# రేపు 28న పోలియోపై సమర యుద్ధం....

- ' పోలియో మహమ్మారిని అంతం చేయుటకు పూర్తి ఏర్పాట్లు
- గద్వాల్ జిల్లాలోని 5 సం,,లోపు చిన్నార్లులే లక్ష్యం
- జోగులాంబ గద్వాల జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి....



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 26 (మనం బ్యూరో): పోలియో రహిత సమాజంగ మార్చేందుకు ప్రతిష్టాత్మకంగ నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం-2026 జూన్ 28 ఆదివారం రోజున జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పూర్తి ఏర్పాట్లు చేసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె. సంధ్యా కిరణ్మయి నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా, మొహమ్మద్ అస్గర్ అలీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ...జిల్లా లక్ష్యం - కార్యాచరణ వివరాలు... 1. జిల్లాలో 0-5 సంవత్సరాల లోపు 69,383 మంది చిన్నారులను గుర్తించడం జరిగింది. వీరందరికి 100% పోలియో చుక్కలు వేయడం ప్రథమ లక్ష్యం.

**2. ...హైరిస్క్ ప్రాంతాలు...**

జిల్లాలో 53 హైరిస్క్ ఏరియాలు గుర్తించడం జరిగింది. వాటిపై ప్రత్యేక దృష్టి వలస కూలీలు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, నిర్మాణ రంగ కార్మికుల పిల్లలు ఏ ఒక్కరు కూడ తప్పిపోకుండ ప్రత్యేక్కరిని గుర్తించి ఉధృతంగ పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**3. బూత్ డే, హౌస్ టు హౌస్....**

28-05-2026 ఆదివారం రోజున బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వెయడానికి జిల్లా వ్యాప్తంగ 471 పోలియో బూత్లు, ఇందుకోసం ఆసుపత్రులు, అంగన్వాడి కెంద్రాలు, గ్రామపంచాయతీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక బూత్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రతి బూత్లో నలుగురు చొప్పున మొత్తం 1,884 మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందని వివరించారు. వారందరు ఆది, సోమ, మంగళ వారాలలో ఈ మూడు రోజుల పాటు ఉ,, 7:00 గం,,ల నుండి సా,, 5:00 గం,,ల వరకు పోలియో చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు.

29, 30వ. తేదీలలో రెండు రోజుల పాటు గ్రామాలలో కలియ తిరుగుతు మొత్తం జిల్లాలోని 1,38,219 ఇళ్లను ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి బూత్కు రాని పిల్లలను గుర్తించి ఇంటి వద్దనే చుక్కలు వేస్తారన్నారు.

**4. ...అర్ధరాత్రి నుంచే ప్రారంభం....**

28వ. తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచే రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లలో ట్రాన్సిట్ టీమ్లు, చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ప్రారంభిస్తారు అని తెలిపారు.

**5. ...పర్యవేక్షణ...**

కార్యక్రమ పర్యవేక్షణకు 45 మంది సెక్టార్ సూపర్వైజర్లు నియమించడం జరిగిందన్నారు. జిల్లా నోడల్ అధికారులు డా, మొహమ్మద్ అజ్గర్ అలీ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

డా, రామచంద్రరావు, ఎన్ సి డి ప్రోగ్రాం అధికారి

డా, జి. రాజు, టి.బి, లెప్రసి ప్రోగ్రాం అధికారి

డా. ప్రసూనరాణి, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారిలు నిరంతర పర్యవేక్షణ చేస్తారన్నారు.

...డి ఎం అండ్ హెచ్ ఓ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి....

పోలియో నిర్మూలన మనందరి సామాజిక బాధ్యతన్నారు. 0-5 ఏళ్ల పిల్లలు ఏ ఒక్కరు కూడ చుక్కలు వేయించుకోకుండ మిగిలిపోకూడదన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజా ప్రతినిధుల సమక్షములో ఆదివారం రోజున ఉ,, 7:00 గం,,లకు కార్యక్రమం ప్రారంభోత్సవం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల పి హెచ్ సి ల వైద్యాధికారులకు అదేవిధంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ఎం ఎల్ హెచ్ పి. లకు ఆదేశాలు జారి చేయడం జరిగిందన్నారు. పోలియో మందు వలన ఎలాంటి దుష్ప్రభావాలు, ప్రతికూల సంఘటనలు కాని జరగవన్నారు. అనాలోచిత ప్రభావాలను నమ్మకుండ అప్పుడే పుట్టిన పసికందు నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులందరికి నిర్భయంగ పిల్లల తల్లిదండ్రులు తమ భాద్యతగ భావించి పిల్లలు అంగవైకల్యానికి గురి కాకుండ , నిండు నూరేళ్ల జీవితానికి రెండు చుక్కల పోలియో మందు వేయించి వారి జీవితానికి బంగారు బాట వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజ్ఞప్తి చేస్తూ పిలుపునిచ్చారు.

పోలియో చుక్కలు పుట్టిన రోజు కాని నిరంతర వ్యాది నిరోదక టీకాల కార్యక్రమములో కాని ఇంతకు మునుపు ఎప్పుడైన, ఎక్కాడైన వేసిన వేయించిన పిల్లకందరికి కూడ మరో సారి ఈ కార్యక్రమములో ఎలాంటి సందేహము లేకుండ నిర్భయంగ పోలియో చుక్కలు వేయించాలన్నారు.

తీవ్రమైన జ్వరము, వాంతులు, విరెచనాలు, దగ్గు జలుబు ఉపిరిఆడక పొవడం, మూర్ఛ వ్యాది గ్రస్థులకు, ఏ వ్యాదితోనైన ప్రస్తుతం చికిత్స పొందుతున్న పిల్లకు పోలియో చుక్కలు వెయరాదన్నారు.ఇట్టి బ్రహుత్తరమైన కార్యక్రమం విజయవంతం చేయడానికి ఎలాంటి ఆవాంచనియ సంఘటనాలు జరుగకుండ అన్ని శాఖాల జిల్లా స్థాయి, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిదులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రింట్ మీడియా,ఎలక్ట్రానిక్ మీడియా పత్రిక విలేకరులు, ప్రజలందరు కార్యక్రమంలో పాల్గొని తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరనైనది.



# నిర్మాతలకు విజయ్ షాకింగ్ కండీషన్స్..

## స్పందించి క్లారిటీ ఇచ్చిన 'రణబాలి' మూవీ టీమ్

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోంది. షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకోగా..ఈ సినిమాను సెప్టెంబర్ 11న థియేటర్స్ లోకి తీసుకొచ్చేందుకు మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ షాకింగ్ వార్త నెట్టింట చర్చనీయాంశంగా మారింది. 'రణబలి' సినిమా షూటింగ్ కోసం విజయ్ దేవరకొండ ఏకంగా 5 నుండి 6 క్యారవాన్లు కావాలని డిమాండ్ చేశారంటూ వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాకుండా కొన్ని ప్రముఖ న్యూస్ పోర్టల్స్, యాప్స్ పేర్లతో ఉన్న ఫేక్ స్క్రీన్ షాట్స్ ను కూడా సృష్టించి సర్కులేట్ చేస్తున్నారు. ఈ విషయం కాస్త మూవీ టీమ్ కంటపడటంతో నిర్మాత రవి స్పందించి క్లారిటీ ఇచ్చారు.

అయితే, ఈ ప్రచారంలో అస్సలు నిజం లేదని, ఇవన్నీ పూర్తిగా అబద్ధపు ముచ్చట్లని స్పష్టం చేశారు. విజయ్ దేవరకొండ ఇమేజ్ ను దెబ్బతీయడానికి కొందరు కావాలనే ఇలాంటి రూమర్స్ క్రియేట్ చేస్తున్నారని.. కాబట్టి సోషల్ మీడియాలో వచ్చే ఇలాంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని, అలాగే వాటిని షేర్ చేస్తూ రూమర్స్ ను అస్సలు నమ్మించవద్దని కోరారు. విజయ్ దేవరకొండ ఎప్పుడూ చాలా ప్రొఫెషనల్ గా ఉంటారని.. సినిమాను చెడగొట్టడానికి కొందరు కావాలనే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దయచేసి ఇలాంటి రూమర్స్ ను ఎవరూ నమ్మొద్దు, షేర్ చేయొద్దని కోరారు. ఇలాంటి వార్తలను ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పుకార్లకు చెక్ పడినట్లు అయింది.

# భారత్ ఆలౌట్.. తొలి టీ20లో ఐర్లాండ్ విజయం

రెండు టీ20ల సిరీస్ లో భాగంగా శుక్రవారం భారత్ తో జరిగిన తొలి మ్యాచ్ లో ఐర్లాండ్ విజయం సాధించింది. 34 పరుగుల తేడాతో గెలుపొందింది. 182 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 18.5 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ శర్మ (50; 20 బంతుల్లో 7స4,2స6) అర్ధశతకం వృథా అయ్యింది. శివమ్ దూబె (25), తిలక్ వర్మ (19), అక్షర్ పటేల్ (15) మినహా మిగతావారంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో హంప్ రేస్, హొల్లార్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. జై మొంద్రా 2, మెక్కర్తీ, గరేత్ ఒక్కో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లొర్కాన్ టక్కర్ (50) హాఫ్ సెంచరీ సాధించాడు. డాక్ రెల్ (49) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్ష్దీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు.

ఐర్లాండ్తో టీ20 మ్యాచ్ లో భారత్ గెలుపు అవకాశాలు అంతకంతకూ క్లిష్టంగా మారుతున్నాయి. భారీ సిక్సర్ తో టీమ్ ఇండియా గెలుపు ఆశలు సజీవంగా ఉన్నాయని చెప్పిన శివమ్ దూబె (25).. ముంద్రా వేసిన 16వ ఓవర్ చివరి బంతికి కాట్ అండ్ బౌల్డా వెనుదిరిగాడు. హర్షిత్ రాణా క్రీజులోకి వచ్చాడు. 16 ఓవర్లకు భారత్ స్కోరు 135/7. భారత్ విజయం సాధించాలంటే 4 ఓవర్లలో 47 పరుగులు చేయాల్సి ఉంది.

టీమ్ఇండియాకు మరో షాక్ తగిలింది. ఓ వైపు చేయాల్సిన పరుగుల రన్ రేట్ పెరుగుతుంటే.. మరోవైపు వికెట్లు పడుతున్నాయి.



మాథ్యూ హోలార్డ్ వేసిన 12వ ఓవర్ చివరి బంతికి వాషింగ్టన్ సుందర్ (9) పెవిలియన్ కు చేరాడు. బౌండరీ లైన్ వద్ద బెంజమిన్ సులువైన క్యాచ్ ను అందుకొన్నాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 12 ఓవర్లకు 100/6. క్రీజ్ లో దూబే, అక్షర్ పటేల్ ఉన్నారు. టీమ్ఇండియా విజయానికి 48 బంతుల్లో 83 పరుగులు అవసరం.

# ఆన్ లైన్ ట్రోలింగ్.. మహిళా క్రీడాకారులకు ఐసీసీ అండ

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ పెరిగింది. క్రీడాకారిణులు, హీరోయిన్లపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్లో ఆడుతున్న క్రికెటర్లు ట్రోలింగ్ బారిన పడకుండా ఐసీసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఏఐ సంస్థ ఫ్రీడమ్2హియర్ తో కలిసి 'ఐసీసీ ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్' ను తీసుకొచ్చింది. ప్రత్యేక టూల్ ద్వారా.. అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న మహిళా ప్లేయర్ల సోషల్ మీడియా ఖాతాలను నిశితంగా గమనిస్తూ, వారు ట్రోలింగ్ బారిన పడకుండా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇప్పటి వరకు క్రీడాకారులను ఇబ్బంది పెట్టేలా ఉన్న దాదాపు 60,000కు పైగా పోస్టులను తొలగించారు.



2024 మహిళల టీ20 ప్రపంచకప్ సమయంలో ఐసీసీ ఈ టూల్ ను తీసుకొచ్చింది. కానీ, తాజా టీ20 ప్రపంచకప్ సీజన్ మొదలైన తర్వాత ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్ లో చేరిన వారి సంఖ్య అమాంతం పెరిగింది. తమను ట్రోలింగ్ నుంచి రక్షించాల్సిందిగా 50 మంది క్రికెటర్లు విజ్ఞప్తి చేసినట్లు ఐసీసీ తాజాగా వెల్లడించింది. ఇప్పటి వరకు 100 మందికి పైగా మహిళా క్రీడాకారులు ఇందులో సభ్యులుగా చేరారు. ఐసీసీ సోషల్ మీడియా ఖాతాలకు అదనపు భద్రత చేకూర్చాలనే ఉద్దేశంతో తొలుత దీనిని తీసుకొచ్చారు. కానీ, క్రీడాకారిణులపై ట్రోలింగ్ ఎక్కువవుతున్న నేపథ్యంలో.. మొత్తం 12 జట్లలో కీలకమైన 7 జట్ల సభ్యులతోపాటు, అంపైర్లు, బ్రాడ్ క్యాస్టర్ల అధికారిక ఖాతాలకు కూడా రక్షణ కల్పిస్తున్నట్లు ఐసీసీ ప్రకటనలో పేర్కొంది. టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన వారం రోజుల్లోనే ఈ టూల్ 2,50,000 కామెంట్లను రివ్యూ చేసి.. ఇబ్బందికరంగా ఉన్న 60,000 కామెంట్లను తొలగించినట్లు పేర్కొంది. ఇతరులను కించపరిచేలా తరచూ కామెంట్లు చేస్తున్న 2000 మందిని గుర్తించి వారిపై తాత్కాలిక నిషేధం విధించామని, మరో 370 మందిని బ్లాక్ చేసినట్లు పేర్కొంది. సోషల్ మీడియా మరీ ఇబ్బందికరంగా మారుతున్న తరుణంలోనే ఈ ప్రోగ్రామ్ లో చేరాల్సి వచ్చిందని స్పిన్నర్ రాధా యాదవ్ పేర్కొంది. ''స్నేహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులతో సరదాగా మాట్లాడుకునేందుకు సోషల్ మీడియా అద్భుతమైన ప్లాట్ఫాం. కానీ, అది క్రమంగా విషపూరితమవుతోంది. ముఖ్యంగా మహిళా క్రీడాకారులను తీవ్ర ఇబ్బంది పెడుతోంది'' అని తెలిపింది.



# మర్చిపోలేని అనుభూతిని 'ఆల్ఫా' సినిమా ఇచ్చింది: ఆలియా భట్

శివ్ రావేల్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ ప్రాజెక్ట్ 'ఆల్ఫా'. ఇందులో ఆలియా భట్, శార్వరి వాఘ్, బాబీ డియోల్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. యష్ రాజ్ ఫిలమ్స్ స్పై యూనివర్స్ లో వస్తున్న మొదటి ఫిమేల్ ఓరియంటెడ్ స్పై ఫిల్మ్ కావడంతో 'ఆల్ఫా' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూలై 3న థియేటర్స్ లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన ఆలియా భట్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాలో ఆలియా భట్ మునుపెన్నడూ లేని విధంగా భారీ యాక్షన్ సీక్వెన్స్ లలో నటించిన విషయం తెలిసిందే. అయితే ఈ యాక్షన్ సీన్స్ అన్నీ స్క్రీన్ పై చాలా రియలిస్టిక్ గా కనిపించడం కోసం తాము చాలా రోజులు కష్టపడి ప్రాక్టీస్ చేశామని ఆలియా చెప్పారు.



ఒకరోజు ఫైట్ సీక్వెన్స్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో తన టైమింగ్ మిస్ అయ్యి అనుకోకుండా ఫైట్ కొరియోగ్రాఫర్ ను గట్టిగా కొట్టేశానని ఆమె గుర్తు చేసుకున్నారు. అది చూసి తానే షాక్ అయ్యానని, వెంటనే అతనికి సారీ కూడా చెప్పానని ఆలియా వివరించారు. తన వల్ల ఒకరికి దెబ్బ తగిలినందుకు చాలా బాధ కలిగిందని ఆలియా ఎమోషనల్ అయ్యారు. అది కావాలని చేసింది కాకపోయినా.. తన వల్ల ఒక వ్యక్తికి దెబ్బ తగలడం తనను చాలా కుంగిపోయేలా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ అయిపోయినా కూడా ఇప్పటికీ ఆ సీన్ గుర్తొచ్చినప్పుడల్లా తనకు మనసులో చాలా బాధగా అనిపిస్తుందని ఆలియా చెప్పుకొచ్చారు. అలాగే ఈ సినిమాలో యాక్షన్ కొరియోగ్రఫీ మాత్రం చాలా అద్భుతంగా ఉంటుందని అన్నారు. తన లైఫ్ లోనే ఎప్పటికీ మర్చిపోలేని ఒక మంచి అనుభూతిని 'ఆల్ఫా' సినిమా తనకు ఇచ్చిందని ఆలియా సంతోషం వ్యక్తం చేశారు.

# 'జైలర్ 2' పూర్తి చేసిన హృతిక్ రోషన్!

టైగర్ కా హుకూం.. అంటూ 'జైలర్' చిత్రంతో తనదైన స్టైల్ లో సందడి చేశారు రజనీకాంత్. దీనికి సీక్వెల్ గా 'జైలర్ 2' రూపొందుతోన్న విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ అగ్రకథానాయకుడు హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయినట్లు సమాచారం. సెప్టెంబర్ 11న ఈ సినిమా విడుదల కానుంది. 'జైలర్ 2' సినిమాతో రజనీకాంత్, హృతిక్ రోషన్ మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారు. కానీ, దాదాపు 40 ఏళ్ల క్రితం ఈ ఇద్దరూ ఓ సినిమా కోసం స్క్రీన్ పంచుకున్నారు. 1986లో విడుదలైన 'భగవాన్ దాదా' అనే హిందీ సినిమాలో వీరిద్దరూ నటించారు. అప్పుడు పదేళ్ల వయసున్న హృతిక్ రోషన్ బాలనటుడిగా నటించాడు.ఈ సినిమాను హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ నిర్మించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ఈ సినిమా గురించి హృతిక్ మాట్లాడుతూ.. తన పక్కన ఉన్నది భారతీయ సినిమాలోనే ఒక అతిపెద్ద లెజెండ్ అనే విషయం అప్పట్లో తెలియలేదన్నారు.

# మహిళలు చేస్తున్న నేరాలపై సినిమా తీయమన్న నెటిజన్..

## రాహుల్ రవీంద్రన్ షాకింగ్ రియాక్షన్!



టాలీవుడ్ దర్శకుడికి ఓ వింత అనుభవం ఎదురైంది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పురుషులపై మహిళలు చేస్తున్న నేరాల కాన్సెప్ట్ తో ఓ సినిమా తీయమని నెటిజన్ రాహుల్ ను ట్యాగ్ చేసి మరీ పోస్ట్ పెట్టారు. తాజాగా, ఈ విషయంపై రాహుల్ ట్విట్టర్ ద్వారా రియాక్ట్ అవుతూ.. 'నాకు అన్నీ తెలుసని నేను అస్సలు అనుకోను బ్రదర్.. ఒకవేళ నేను చెప్పేది తప్పైతే నాకు వివరించండి. కానీ, సమాజంలో మగవారిపై ఆడవారు చేసే అఘాయిత్యాలు నాకైతే ఎక్కడా కనిపించడం లేదు. మానసిక సమస్యలు లేదా సమాజ వ్యతిరేక ప్రవర్తన ఉన్న కొందరు ఆడవాళ్లు చేసే ఘోరమైన నేరాలను నేను చూస్తున్నాను. కానీ, మరోవైపు శతాబ్దాలుగా ఆడవారిని ఊపిరాడకుండా చేస్తున్న ఒక వ్యవస్థను నేను గమనిస్తున్నాను. కంటికి కనిపించని, రోజువారీ చిన్న చిన్న దాడుల ద్వారా మహిళలు తమ గుర్తింపును కోల్పోయేలా ఆ వ్యవస్థ బలవంతం చేస్తోంది. అది వారికి సమానమైన ప్రపంచాన్ని ఇవ్వడం లేదు. నా చుట్టూ ఉన్న ఎంతో మంది మహిళలు దీనివల్ల నిశ్శబ్దంగా బాధపడటం చూశాను. అందుకే నా 'ది గర్ల్ ఫ్రెండ్' కథ ద్వారా ఆ విషయాన్నే చెప్పాలనుకున్నాను. ఒక మగవాడిగా సమాజంలో ఉన్న ఈ అధికార సమీకరణాల వల్ల నేను లాభపడుతున్నాను కాబట్టి, దీనికి నేనే బాధ్యత వహించాలని అనుకున్నాను' అని చెప్పారు.

నెటిజన్ చెప్పిన నేర సంఘటన గురించి మాట్లాడుతూ.. 'నేను ఇంకా ఆ కేసు వివరాలు పూర్తిగా చదవలేదు, తప్పకుండా చదువుతాను. ఒకవేళ అందులో ఏదైనా ఆసక్తికరమైన పాయింట్ ఉంటే సినిమా కూడా తీస్తాను. కానీ అది ఒక పర్టికులర్ మహిళ చేసిన నేరం గురించి మాత్రమే ఉంటుంది కానీ, మగవారిపై ఆడవాళ్లు చేసే నేరాల కేటగిరీ కిందకు రాదు. నా దృష్టిలో ఆ రెండింటికీ చాలా తేడా ఉంది. ఇలాంటి నేరాలు చాలా ఘోరమైనవి, దారుణమైనవి. కానీ నేను నా సినిమాలో చూపించాలనుకున్న పాయింట్ వేరు, దానికి ఇలాంటి నేరాలతో ఎలాంటి సంబంధం లేదు' అని క్లారిటీ ఇచ్చారు. చివరగా తన సినిమా గురించి చెప్తూ.. ''ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలో విక్రమ్ పాత్ర హంతకుడు లేదా నీచుడు కాదు. అందులో ఎలాంటి శారీరక హింస ఉండదు. నిజానికి అతను నమ్మకమైనవాడే. అయినప్పటికీ, కొందరు ఈ సినిమా చూసి ఎందుకు హర్ట్ అవుతున్నారో వాళ్లే ప్రశ్నించుకోవాలి. ఏదేమైనా మీకు ఎలాంటి సమస్య ఉన్నా దాన్ని ఎత్తి చూపడం మంచి అలవాటు. నేను ఆ ఫీడ్ బ్యాక్ ను తీసుకుని కచ్చితంగా ఆత్మపరిశీలన చేసుకుంటాను. మనమందరం ఒకరితో ఒకరు మాట్లాడుకుని, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా మంచి విషయం' అని రాసుకొచ్చారు.

# తలైవా 173లో ఆఫర్ అందుకున్న మీనాక్షి చౌదరి!

సూపర్ స్టార్ రజినీకాంత్ తన 173వ చిత్రంతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'ధర్మన్' అనే పవర్ ఫుల్ టైటిల్ ను ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రజినీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్ ఫుల్ గా ఉండబోతుందని హింట్ ఇచ్చారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ ఎక్స్ పెక్టేషన్స్ నెలకొన్నాయి. కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది.

ఇక త్వరలో సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'STR51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్ గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.